గ్రేటర్‌కు పాలకులు..!

- మార్చి నాటికి ఐదు పాలికెల ఎన్నికలకు కసరత్తు
- ఆశావహుల కోసం జాబితాలకు రూపకల్పన



బెంగళూరు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): బృహత్ బెంగళూరు మహానగర పాలికె (బీబీఎంపీ) స్థానంలో గ్రేటర్ బెంగళూరు అథారిటీ (జీబీఏ) ఏర్పడింది. బీబీఎంపీకి ఎన్నికలు లేక ఒక విడత కాలయాపనతోనే ముగిసింది. గ్రేటర్ బెంగళూరు అథారిటీ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలతోపాటు అభివృద్ధి చేయాలని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. సమగ్ర అభివృద్ధితోపాటు ప్రజలు ఎదుర్కొనే సమస్యలు వేగవంతంగా పరిష్కారం కావాలంటే తగినంతమంది ఉద్యోగులే కాకుండా పాలకులు ఉండాలి. నీరు, కాలువలు, రోడ్లు వంటి సౌకర్యాలే కాకుండా ప్రాంతాలవారీగా ఉద్యానవనాలతోపాటు భిన్నమైన సమస్యలు వేగవంతంగా పరిష్కారం కావాలంటే పాలకవర్గాలు ఉండాలి. గ్రేటర్ బెంగళూరును చాలెంజ్‌గా డీసీఎం, బెంగళూరు అభివృద్ధిశాఖ మంత్రి ఏర్పాటు చేశారు. ఎన్ని సమస్యలు ఎదురైనా వెనుకడుకుండా అన్నింటికీ దీటుగా సమాధానాలు చెబుతూ అనుకున్న విధంగానే బెంగళూరు పాలికెను గ్రేటర్‌గా మార్చారు. ఇక్కడిదాకా ఉన్న పంతం, పట్టుదల పాలకవర్గాల ఏర్పాటు దాకా కూడా కొనసాగించాలని డీసీఎం భావిస్తున్నారు. జీబీఏ పరిధిలోని ఐదు పాలికెలలోనూ కాంగ్రెస్ మేయర్లను తీసుకురావాలని పట్టుదలతో ఉన్నారు. ప్రస్తుత కాంగ్రెస్‌ప్రభుత్వంలో అన్ని డీకే శివకుమార్ కనుసైగలలోనే జరుగుతున్నాయి. ఇదే సరైన సమయమని ఐదు పాలికెల ఏర్పాటుతో ప్రతిపక్షాల నుంచి వచ్చిన విమర్శలను తిప్పికొట్టి ఐదుగురు మేయర్లను సాధించడం ద్వారా 2028 శాసనసభ ఎన్నికలకు సులువుగా ఉంటుందని భావిస్తున్నారు. అందుకోసమే త్వరితగతిన ఎన్నికలకు వెళ్లాలనే ఆలోచనలో ఉన్నారు.

ఐదు పాలికెల విభజన పూర్తయ్యింది. వార్డుల ఏర్పాటు ముగిసింది. ఇక జరగాల్సింది కేవలం రిజర్వేషన్ల ఖరారు మాత్రమే. ఇప్పటికే హైకోర్టు, సుప్రీంకోర్టు బెంగళూరుకు పాలకవర్గం లేకపోవడంపై ప్రభుత్వాన్ని మందలించాయి. రానున్న రోజుల్లో ధర్మాసనాలు కఠినమైన వ్యాఖ్యలు చేసినా లేదా ఎన్నికల కమిషన్‌పై ఆగ్రహం వ్యక్తం చేసినా ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుంది. కోర్టు గడువు ఇస్తే ఆలోగానే ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంటుంది. హడావుడి వలన నిర్ణయాలలో మార్పు వస్తే ప్రతిపక్షాలకు అవకాశం దక్కవచ్చునని అధికార పార్టీ యోచిస్తోంది. అందుకే ఎన్నికలకు వెళ్లే విషయంలో సీఎం, డీసీఎంలు సిద్ధంగా ఉన్నారు. కేపీసీసీలో పలుమార్లు నగర పరిధికి చెందిన ఎమ్మెల్యేలు, వార్డుస్థాయి నాయకులతో పదే పదే సమావేశాలు జరుపుతున్నారు. ఇవన్నీ అంతర్గతంగా సాగుతున్నా వార్డులలో అప్పుడే రాజకీయ అలజడి కదులుతోంది.

జేడీఎస్‌తో కలసి ముందుకెళ్లాలనే నిర్ణయంలో ఎటువంటి మార్పు ఉండదని పార్టీవర్గాలు అభిప్రాయపడుతున్నాయి. లోక్‌సభ ఎన్నికల్లో కలసి పోటీ చేసినప్పటి నుంచి ఇకపై అన్ని ఎన్నికలలోనూ వేర్వేరుగా వెళ్లకుండా కలిసే పనిచేయాలని బీజేపీ అధిష్ఠానం నుంచి స్థానిక నేతలకు ఆదేశాలు ఉన్నాయి. పైగా కేంద్రప్రభుత్వంలో కుమారస్వామి కీలకమైనశాఖ మంత్రిగా కొనసాగుతున్నారు. ఇటువంటి తరుణంలో గ్రేటర్ ఎన్నికలకోసం ఎవరికివారిగా వెళ్లే ఆలోచన ఉండదు. కలసి ముందుకెళ్తే ఎక్కువమంది కార్పొరేటర్లను గెలిపించుకోవచ్చునని ఇరు పార్టీలు భావిస్తున్నాయి.

రాష్ట్రంలో ప్రధానమైనవి మూడు రాజకీయ పార్టీలు కాగా సీపీఎం, సీపీఐల ప్రభావం ఏమాత్రం లేదని చెప్పవచ్చు. కానీ ఢిల్లీ తర్వాత బెంగళూరుపైనే దృష్టి సారిస్తామని ప్రకటించింది. 2015 ఎన్నికల్లో ఆప్ పోటీ చేయాలని భావించినా సాధ్యం కాలేదు. ప్రస్తుతం ఎన్నికలు జరిగితే ఖాతా తెరవాలని భావిస్తున్నారు. గ్రేటర్ పేరిట ఐదు పాలికెలు కావడంతో కన్నడిగులకు వెనుకబాటు అవుతుందనే అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తం అవుతున్నాయి. పార్టీలు పరువు కాపాడుకుంటూనే కన్నడిగుల ప్రాధాన్యతలో రాజీ లేకుండా ముందుకు వెళ్లాలని వివిధ పార్టీలు యోచిస్తున్నాయి. అన్నీ అనుకున్నట్టు జరిగితే వచ్చే ఏడాది ఆరంభంలో ఎన్నికల ప్రక్రియ ప్రారంభమై రెండోనెల తర్వాత సమరం కొనసాగవచ్చునని అనిపిస్తోంది. ఈలోగా పార్టీలు, ప్రభుత్వం ఏ విధంగా వ్యవహరిస్తుందనేది కీలకం కానుంది.

కాంగ్రెస్‌లో ఎన్నికల జోరు

గ్రేటర్ బెంగళూరు ప్రాధికార ఏర్పాటు చేయడం ఓ సవాల్ అయితే అధికారంలో ఉండి మరోసాధనగా ఐదు పాలికెలను దక్కించుకోవాలని డీసీఎం భావిస్తున్నారు. అందుకే బెంగళూరు నడక పేరిట ప్రాంతాలవారీగా ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తున్నారు. లాల్‌బాగ్, కబ్బన్‌పార్కు, జేపీ పార్కు, కేఆర్ పురం తోపాటు వివిధ ప్రాంతాలకు వెళ్లి ప్రజాభిప్రాయాలు సేకరిస్తూనే మరోవైపు స్థానిక సమస్యలను ఆలకించారు. ప్రజలు ఎలాంటి విషయాలపై స్పందిస్తున్నారు, స్థానిక నాయకుల పట్ల ప్రజలలో ఎటువంటి అభిప్రాయం ఉందనేది పరిశీలిస్తున్నారు. ప్రాంతాలవారీగా ఎన్నికలకు సిద్ధం కావాలని కాంగ్రెస్ వర్గాలను చైతన్యపరుస్తున్నారు. ప్రస్తుతం పాలికె ఎన్నికల విషయంలో ఇతర పార్టీలతో పోలిస్తే అధికార కాంగ్రెస్ ముందంజలో ఉందని చెప్పవచ్చు.

గ్రేటర్‌ను వ్యతిరేకించినా... సమష్టి సాధనకు వ్యూహం

బెంగళూరును నాడప్రభు కెంపేగౌడ నిర్మించారని, ఆయన ఆశయాలకు భిన్నంగా ఐదు విభాగాలు చేసి గ్రేటర్ పేరు పెట్టారని బీజేపీ తీవ్రంగా వ్యతిరేకించింది. అయితే గ్రేటర్ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుకున్నవన్నీ సాధించి ఒక నిర్దిష్టమైనస్థాయికి తీసుకెళ్లింది. సీఎం అధ్యక్షతన జీబీఏ తొలిసభ కూడా ముగించారు. జరిగిన విషయాన్ని నిరంతరం ప్రస్తావించకుండా ఎన్నికలలో వెనుకబడరాదని బీజేపీ కూడా సిద్ధమైంది. బూత్‌స్థాయిలో కార్యకర్తలను చైతన్య పరుస్తున్నారు. వార్డులవారీగా రిజర్వేషన్లకు అనుగుణంగా ఆశావహుల జాబితాలను సిద్ధం చేస్తున్నారు. నవంబరులో ఈ ప్రక్రియ మరింత వేగిరం చేయాలని భావిస్తున్నారు.

విధానసౌధకు వస్తా...

అనుమానం ఉంటే రండి

- స్పీకర్ యూటీ ఖాదర్



బెంగళూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): శాసనసభ కార్యాలయం చేపట్టిన పలు అభివృద్ధి ఇతరత్రా కార్యక్రమాలలో ఎవరికైనా అనుమానాలుంటే వచ్చి నేరుగా కలవవచ్చునని, గురువారం విధానసౌధకు వస్తానని స్పీకర్ యూటీ ఖాదర్ ప్రకటించారు. బుధవారం మంగళూరులో మీడియాతో మాట్లాడుతూ విధానసౌధకు వెళ్తున్నానని కార్యాలయంలోనే ఉంటానని లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తే స్వీకరిస్తానన్నారు. మాజీ స్పీకర్ విశ్వేశ్వరహెగ్డే కాగేరి ఆరోపణలపై ఆయన స్పందించారు. కాగేరి కూడా రాజకీయాల్లో ఉన్న వ్యక్తి అని, ఎమ్మెల్యేగా, ఎంపీగా గౌరవమైన పదవులలో కొనసాగారన్నారు. ఆయన ఆరోపణలను గమనించానన్నారు. ఎక్కడో కూర్చుని మాట్లాడితే సరికాదని, ఏం అవినీతి జరిగిందో, ఏ అంశమైనా లిఖితపూర్వకంగా ఇస్తే పరిశీలిస్తానన్నారు. తద్వారా శాసనసభ గౌరవాన్ని పెంచేందుకు వీలుంటుందన్నారు. సకారాత్మక చర్చకు సిద్ధమన్నారు. కర్ణాటక శాసనసభ అంతర్జాతీయస్థాయిలోనూ గౌరవం పొందుతోందన్నారు. ఇటువంటి సమయంలో ఆరోపణలు సరికాదన్నారు. అన్ని రోగాలకు మందు ఉందని, అసూయకు లేదన్నారు. రాజకీయంగా చెప్పాలంటే ఎన్నో అంశాలు ఉన్నాయన్నారు. నేను శాసనబద్ధమైన హోదాలో ఉన్నానని, నేను ఇప్పుడు ప్రతిపక్ష మిత్రుడినన్నారు. శాసనసభలో లాంజ్ మసాజ్‌పార్లర్‌గా మారిందని ఎమ్మెల్యే భరత్‌శెట్టి ఆరోపణలపై స్పందిస్తూ ఆయన ఇక్కడ ఓ విధంగాను, బెంగళూరులో మరోవిధంగాను మాట్లాడతారన్నారు. ఆరోపణలతో నాకు హాని కలిగించడంలో వారికి సంతోషం లభిస్తేరోజూ ఎన్నైనా చేసుకోవచ్చునన్నారు. ఇటువంటి ఆరోపణలు నాకు కొత్త కాదన్నారు. రాజకీయ జీవితంలో నిరంతరం చూశానన్నారు. మంత్రి పదవిపై ఒకరోజు తర్వాత నా అభిప్రాయం చెబుతానంటూ దాటవేశారు.

కాబోయే సీఎం మల్లికార్జున ఖర్గే

- ఎమ్మెల్యే యత్నాళ్



బెంగళూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నవంబరు క్రాంతి జరుగుతుందని లాబీ చేసేవారికి పదవి లభించదని, మల్లికార్జునఖర్గే ముఖ్యమంత్రి అవుతారని విజయపుర ఎమ్మెల్యే బసనగౌడ పాటిల్ యత్నాళ్ అన్నారు. బుధవారం బెళగావిలో మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్‌లో సీఎం పదవి కోసం కుస్తీ ప్రారంభమైందన్నారు. ప్రతి ఆశావాహి లాబీ జరుపుతున్నారన్నారు. వారికి మద్దతుగా మాట్లాడేవారు తెరపైకి వస్తున్నారన్నారు. ఈ కుస్తీలో వినపడని మల్లికార్జున ఖర్గే చిత్రంలో కనిపిస్తారన్నారు. రాష్ట్ర సారథ్యం డార్క్‌హార్స్‌కు లభిస్తుందన్నారు. ఏఐసీసీ అధ్యక్షుడిగా ఉన్న ఖర్గే ముఖ్యమంత్రి కావాలని భావిస్తున్నారన్నారు. ఖర్గే పేరు బయటకు వస్తే సతీశ్ జార్కిహొళి, డీకే శివకుమార్ పోటీనుంచి వెనుకడుగు వేస్తారన్నారు. గోవా శాసనసభ ఎన్నికల్లో బీజేపీ తరపున ప్రచారం చేస్తారన్నారు. బీజేపీ అధిష్ఠానం నన్ను వాపసు తీసుకోకుంటే జేసీబీ (జేడీఎస్-కాంగ్రెస్-బీజేపీ)లోని కొంతమందితో పార్టీ పెడతానని, 2028లో ముఖ్యమంత్రి అవుతానన్నారు. మూడుపార్టీలనుంచి బయటకు వచ్చేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. విజయేంద్రను మరోసారి అధ్యక్షుడిగా కొనసాగిస్తామని ప్రకటించిన రోజే కొత్తపార్టీ ప్రకటిస్తానన్నారు. మూడు పార్టీల అసంతృప్తులతో కలసి ముందుకెళ్తానన్నారు.

పరిశోధనలకు ఇండియా రైజింగ్ ఫౌండేషన్

రూ.1000 కోట్లు



సంస్థ లోగోను ఆవిష్కరిస్తున్న సభ్యులు

బెంగళూరు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): పరిశోధనల ఆవిష్కరణల కోసం ఇండియా రైజింగ్ ఫౌండేషన్ రూ.1,000కోట్లను కేటాయించదలచినట్లు ప్రకటించింది. ఈమేరకు నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో సంస్థ ప్రతినిధులు మీడియాతో మాట్లాడారు. ఇండియా రైజింగ్ ఫౌండేషన్ ముఖ్య రాయబారి పద్మశ్రీ డాక్టర్ ప్రహ్లాద్‌రావ్ మాట్లాడుతూ 2047లోగా భారత్‌ను పరిశోధనలు, ఆవిష్కరణల రాజధానిని చేసే జాతీయ మిషన్‌ను చేయడమే లక్ష్యమన్నారు. పదిలక్షల మంది పరిశోధకులను రూపొందించదలచినట్లు తెలిపారు. ఇండియా రైజింగ్ అనే మిషన్ ద్వారా పరిశోధనల పర్యావరణాన్ని కల్పించడమే ఆశయమన్నారు 12 విభాగాలలో చేపట్టే పరిశోధనలకు ఆర్థిక చేయూత ఇస్తున్నట్లు వెల్లడించారు. అందులో వైద్య ఆరోగ్య విభాగం, విద్యుత్, నీరు, పునరుజ్జీవనం, ఆహారం, వ్యవసాయం, ప్రొడక్షన్ ఇండస్ట్రీ, స్టెమ్, డీప్‌టెక్, ఫ్యూచర్ టెక్, మౌలిక సదుపాయాలపై టెక్నాలజీ, అంతరిక్ష పరిశోధనలు, రక్షణారంగం, నిర్మిత పర్యావరణం, అర్థశాస్త్రం, సాహిత్యం, విద్య, సంస్కృతి, కళలు, ఆధ్యాత్మికత వంటి అంశాలలో పరిశోధనలకు ప్రాధాన్యం ఇస్తామన్నారు. ప్రాచీన జ్ఞానం, ఆధునికత అనే తత్వం ఆధారంగా మిషన్ పనిచేయనుందన్నారు. పారంపరిక జ్ఞానాన్ని ఆధునిక సాంకేతిక విజ్ఞానంతో మిళితం చేయడం ద్వారా ప్రపంచస్థాయిలో పరిష్కారాలను సృష్టించడమే ఆశయమన్నారు. భారత పరిశోధనలు, ఆధునిక సంబరం స్థాపించదలిచామని, యువత మహిళలు దివ్యాంగులు, గ్రామీణ ప్రతిభకు అవకాశాలు విస్తరించడం పరిశోధనలు, వాణిజ్యపరమైనవాటికి మద్దతు ఇవ్వడం, భారతీయ విలువలను విస్తృతం చేయడమే ఆశయమన్నారు.

ఏటా లక్షలాది మందికి వండర్‌లాలో వినోదం



మీడియాతో సంస్థ ఎండీ అరుణ్ చిట్టలపిల్లి

బెంగళూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మారుతున్న సమాజంలో వి నోదం, ఆహ్లాదంగా గడిపేందుకు అన్నివర్గాల ప్రజలు ఆసక్తి చూపుతారని అందుకే వండర్‌లా ప్రత్యేకమైన ఎంటర్‌టైన్‌మెంట్ కల్పిస్తోందని సంస్థ ఎండీ అరుణ్ చిట్టలపిల్లి తెలిపారు. బుధవారం వండర్‌లాలో మీడియాతో మాట్లాడుతూ రెండు దశాబ్దాలుగా సాహసం, ఆధునికత, ఇంజనీరింగ్ ద్వారా గుణాత్మకమైన ఆహ్లాదకర రైడర్స్ ప్రదర్శనలు కల్పించామన్నారు. 2005లో బెంగళూరులో వండర్‌లా ప్రారంభించామని తొలి ఏడాది 3.5 లక్షలమంది సందర్శకులు వచ్చారన్నారు. 20ఏళ్లలో 1.82 కోట్లమందికిపైగా పర్యాటకులు ఆహ్లాదం, ఆనందం పొందారన్నారు. 2012లో పార్కుతోపాటు రిసార్టును ప్రారంభించామన్నారు. జలక్రీడలతోపాటు విలాసవంతమైన విశ్రాంతికేంద్రం ఏర్పాటు చేశామన్నారు. 30 రకాల రైడర్‌లు ఉన్నాయని అన్ని వండర్‌లాపార్కులో 188 రైడర్‌లు ఉన్నాయన్నారు. ఐఎఎస్ గుర్తింపు కలిగినట్టు తెలిపారు. సీఎస్ఆర్ ద్వారా 18 ప్రభుత్వ పాఠశాలలలోని 800మంది విద్యార్థులకు సేవలు అందిస్తున్నామన్నారు. అన్నిపార్కులు కలిపితే 4.6 కోట్లమంది సందర్శకులు వచ్చారన్నారు.

ప్రభుత్వ ఆర్థిక పరిస్థితి ఉత్తమం


- మంత్రి జమీర్ అహ్మద్‌ఖాన్



హక్కుపత్రాలు అందజేస్తున్న మంత్రి జమీర్, వేదికపై మంత్రి సుధాకర్, ఎమ్మెల్యే సుబ్బారెడ్డి

బాగేపల్లి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం దివాళా తీసిందని, ఆర్థిక పరిస్థితి బాగలేదన్న బీజేపీ ఆరోపణల్లో వాస్తవం లేదని ప్రభుత్వ ఆర్థిక పరిస్థితి ఉత్తమంగా ఉందని వసతి, వక్ఫ్, మైనారిటీ సంక్షేమశాఖ మంత్రి జమీర్ అహ్మద్‌ఖాన్ అన్నారు. ముఖ్యమంత్రి ప్రజాసంక్షేమ పథకాలకు వేలకోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నారన్నారు. పట్టణంలోని షాదీమహల్ సమీపాన తాలూకా యంత్రాంగం, తాలూకా పంచాయతీ బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నివాసరహితులకు హక్కుపత్రాలు పంపిణీ చేసి మాట్లాడారు. బీజేపీ పాలనలో పేదలకు ఒక ఇంటిస్థలం, ఇల్లు కూడా ఇవ్వలేదన్నారు. తాను వసతిశాఖ మంత్రి అయ్యాక ఇళ్లకు డిమాండ్ పెరిగిందన్నారు. ముఖ్యమంత్రితో చర్చించి పేదలకు ఇంటిస్థలాలు, ఇళ్లు ఇస్తున్నామన్నారు. బీజేపీవారు పేదలకు ఎలాంటి సంక్షేమపథకం అమలు చేయలేదని అయితే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఆన్‌లైన్‌లో అర్జీ సమర్పించినవారికి ఇల్లు, ఇంటిస్థలం కల్పిస్తున్నట్టు తెలిపారు. డిమాండ్‌కు అనుగుణంగా అర్హులకు దశలవారీగా ఇళ్లు నిర్మించి ఇవ్వనున్నట్టు తెలిపారు. నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రజాదరణ పొందారని మూడు తాలూకాల అభివృద్ధికోసం కృషి చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ హైకమాండ్ నిర్ధారిస్తే మంత్రివర్గ పునఃవ్యవస్థీకరణలో సుబ్బారెడ్డి మంత్రి అయ్యే అవకాశం ఉందని పేర్కొనడంతో అభిమానులు కేరింతలతో సందడి చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రూ.30కోట్లతో మైనారిటీలకు వసతి పాఠశాల, హుసేన్‌షావలి దర్గా అభివృద్ధికి నిధులు గ్రాంటు విడుదల చేసిందన్నారు. మైనారిటీ పిల్లలు బాగా చదువుకుని ప్రయోజకులు కావాలన్నారు. ప్రభుత్వం మూడు తాలూకాల లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణానికి నిధులు విడుదల చేయాలని కోరారు. బాగేపల్లి, చేళూరు, గుడిబండ తాలూకాల రాజీవ్‌గాంధీ వసతి మండలి నుంచి 497మందికి ఇంటిస్థలం హక్కుపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీఎం రాజకీయ కార్యదర్శి నజీర్ అహ్మద్, జిల్లా ఇన్‌చార్జ్, ఉన్నతవిద్యాశాఖ మంత్రి డాక్టర్ ఎంసీ సుధాకర్, జిల్లా అధికారి పీఎన్ రవీంద్ర పాల్గొన్నారు.

హంపికి పోటెత్తిన భక్తులు



ఏకశిలా రథం వద్ద పర్యాటకుల సందడి

కంప్లి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): దక్షిణకాశీగా పేరుగాంచిన హంపి పుణ్యక్షేత్రంలో పర్యాటకులు పోటెత్తారు. రాష్ట్రంతో పాటు ఆంధ్ర, తెలంగాణ, మహారాష్ట్ర, కేరళ, తమిళనాడు, విదేశీ పర్యాటకులు తరలివచ్చారు. వర్షాన్ని కూడా లెక్కచేయకుండా పర్యాటక ప్రాంతాలను తిలకించడానికి విద్యార్థులు తరలివచ్చారు. రెండు, మూడు రోజులుగా ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. అయినా పర్యాటకులు భారీస్థాయిలో తరలివచ్చారు. హంపి విరుపాక్షేశ్వర, పార్వతి, భువనేశ్వరి, ఎదురు బసవన్న కోదండరామ, యంత్రోత్పాదక, ఏకశిలా రథం, నవదిబ్బ, పుష్కరేణి, గజశాల ఆకట్టుకునే మండపాలు, ఆలయాలలో ఎక్కడ చూసినా పర్యాటకులే కనిపించారు. మూడు రోజుల్లోలక్ష మందిపైగా వచ్చినట్లు స్థానికులు చెబుతున్నారు.

అవినీతిని మొగ్గలోనే తుంచేయాలి

- వాకథాన్‌లో కెనరా బ్యాంక్ సీఎండీ

బెంగళూరు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): అవినీతిని మొగ్గలోనే తుంచేయాలని లేదంటే ఎన్నో పర్యవసానాలకు కారణం కానుందని కెనరబ్యాంక్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కె. సత్యనారాయణరాజు అన్నారు. విజిలెన్స్ వారోత్సవాల్లో భాగంగా బుధవారం బసవనగుడి పరిధిలోని నెటకల్లప్ప సర్కిల్‌లో ఉదయం వాకథాన్ చేశారు. సీఎండీ మాట్లాడుతూ అవినీతి పట్ల ఎక్కడైనా ఎంతటివారినైనా ప్రశ్నించాలన్నారు. అవినీతి రహిత సమాజ సాధనకు అందరి బాధ్యత ఉందన్నారు. పారదర్శకతను పెంపొందింపచేయాల్సి ఉందన్నారు. చైతన్యం ద్వారా సమాజంలో మార్పు సాధ్యమన్నారు. విజిలెన్స్ వారోత్సవం అనేది ఏటా జరిగే కార్యక్రమంగా కాకుండా నమ్మకం పెంచడంతోపాటు నైతిక పాలన నిర్మించేలాంటి నిరంతర జవాబుదారీతనం కావాలన్నారు. బ్యాంకు ఖాతాదారులు, విద్యార్థులు, అన్నివర్గాల ప్రజలు సమగ్ర బాధ్యతగా అవినీతిని వ్యతిరేకించాలన్నారు. నమ్మకం నైతిక పాలన ముఖ్యం కావాలనన్నారు. సైబర్ సురక్షితం పట్ల అవగాహన పెంపొందింప చేసుకోవాలన్నారు. వాకథాన్‌లో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌లు భవనేంద్రకుమార్, ఎస్‌కె మంజుందార్, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ నబిన్‌కుమార్‌దశ్‌లు పాల్గొన్నారు. కెనరా బ్యాంకు ప్రధాన కార్యాలయం ఉద్యోగులతో పాటు స్థానిక ప్రజలు పాల్గొన్నారు. ర్యాలీలో అవినీతికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.



వాకథాన్‌లో కెనరా బ్యాంకు ఉద్యోగులతో సీఎండీ సత్యనారాయణరాజు

కన్నేరి మఠాధిపతికి

సుప్రీంకోర్టులోనూ చుక్కెదురు



కాడ సిద్దేశ్వర స్వామీజీ

బెంగళూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): విజయపుర జిల్లాలో ప్రవేశించరాదనే జిల్లా యంత్రాంగం ఆదేశాలను ప్రశ్నిస్తూ మహారాష్ట్ర కొల్హాపురికి చెందిన కన్నేరి మఠాధిపతి కాడసిద్దేశ్వరస్వామీజీకి సుప్రీంకోర్టులోనూ చుక్కెదురైంది. స్వామీజీ దాఖలు చేసిన పిటిషన్‌పై బుధవారం విచారణ జరిపిన న్యాయమూర్తు జస్టిస్ పంకజ్ మిత్తల్, జస్టిస్ ప్రసన్నవరాళెల ద్విసభ్య ధర్మాసనం తీవ్రంగా స్పందించి పిటిషన్‌ను కొట్టివేసింది. ఇలాంటి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయవచ్చునా అని ప్రశ్నించింది. హైకోర్టు వ్యాఖ్యలలో తప్పు ఏముందని ప్రశ్నించింది. స్వామీజీగా గంభీరంగా ఉండాలని, హేళన చేసేలాంటి భాష ఎంతవరకు సమంజసం అన్నారు. వాక్‌స్వాతంత్ర్యం ఉందని ఇష్టారాజ్యంగా మాట్లాడరాదన్నారు. మరో మఠానికి వెళ్లి మౌనంగా ధ్యానం చేసుకోవాలని సూచించారు. మహారాష్ట్రలోని జత్తా తాలూకా బీలూరు గ్రామంలో లింగాయతస్వామీజీల పట్ల అనుచితంగా మాట్లాడారు. ఆలయాలకు వెళ్లరాదని సూచించారు. బసవ సంస్కృతి అభియాన అనేది కేవలం నాటకం అని, గుడిలో దేవుడు లేడని, అందరికీ తానే బుద్ధి చెబుతానంటూ హెచ్చరించారు. ముఖ్యమంత్రి అండతో లింగాయత మఠాధిపతులు సమాఖ్యగా ఏర్పడ్డారని మండిపడ్డారు. ఆయన వ్యాఖ్యలను లింగాతయస్వామీజీలు తీవ్రంగా ఖండించారు. విజయపుర జిల్లా పర్యటనకు వచ్చేందుకు కాడసిద్దేశ్వరస్వామి సిద్ధంకాగా.. జిల్లా యంత్రాంగం రెండునెలలపాటు నిషేధం విధించింది.

గాలి ఆప్తుడు అలీఖాన్‌కు బెదిరింపులు

- ఫోన్‌లో దుర్భాషలాడిన ఎమ్మెల్యే భరత్‌రెడ్డి ముఖ్య అనుచరుడు సతీష్‌రెడ్డి
- ఎస్పీకి అలీఖాన్ ఫిర్యాదు



ఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న అలీఖాన్, గాలి సోమశేఖర్‌రెడ్డి, బీజేపీ కార్యకర్తలు

బళ్లారి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): బళ్లారిలో రాజకీయ కాక రేగింది. మాజీ మంత్రి, గంగావతి ఎమ్మెల్యే గాలి జనార్దన్ రెడ్డి ఆప్తుడు అలీఖాన్‌ను బళ్లారి కాంగ్రెస్ ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి అనుచరుడు సతీష్‌రెడ్డి బెదిరించడం కలకలం రేగింది. ఫోన్‌లో సతీష్ రెడ్డి దుర్భాషలాడాడంటూ ఎస్పీ శోభారాణికి అలీఖాన్ బుధవారం ఫిర్యాదు చేశాడు. బాధితుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పరిచయస్తుడైన వలీబాషా.. అలీఖాన్ మంగళవారం ఫోన్ చేశాడు. సతీష్‌రెడ్డి మాట్లాడతాడంటూ కాన్ఫరెన్స్ కాల్ కలిపాడు. సతీష్‌రెడ్డి దుర్భాషలాడాడు. 'నీది ఎక్కువైంది.. బళ్లారికి రా.. నా కొడకా.. వచ్చి నాకు ఫోన్ చెయ్..' అంటూ బెదిరించాడు. అలీఖాన్ సైతం గట్టిగానే సమాధానమిచ్చాడు. దీనిపై బీజేపీ నాయకులు మాజీ ఎమ్మెల్యే గాలి సోమశేఖర్‌రెడ్డి, కార్పొరేటర్ మోత్కర్ శ్రీనివాసులు, పార్టీ నగరాధ్యక్షుడు గుర్రం వెంకటరమణ, పలువురు ముస్లింలతో కలిసి అలీఖాన్ బుధవారం ఎస్పీ కార్యాలయానికి వచ్చాడు. సతీష్‌రెడ్డి బెదిరించాడని ఫిర్యాదు చేశాడు. అతడి నుం చి ప్రాణహాని ఉందని తెలిపాడు. ఫోన్ సంభాషణ ఆడియోలను అందజేశారు. ఫిర్యాదు అనంతరం గాలి సోమశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. బళ్లారిలో దౌర్జన్యాలు అధికమయ్యాయన్నారు. ప్రతిపక్ష పార్టీగా ప్రజలకు అంగడా ని లుస్తామని తెలిపారు. ఈ విషయంపై ఎస్పీ శోభారాణి మాట్లాడుతూ.. ఈ కేసును కౌల్‌బజార్ పోలీస్‌స్టేషన్‌కు రెఫర్ చేశామన్నారు. విచారిస్తున్నట్లు తెలిపారు.

కనకదాస విగ్రహావిష్కరణకు రండి

● కలెక్టర్, ఎస్పీకి ఎంపీ, ఎమ్మెల్యే ఆహ్వానం



కలెక్టర్ ఆనంద్‌కు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న ఎమ్మెల్యే, ఎంపీ

కళ్యాణదుర్గం రూరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కళ్యాణదుర్గంలో నవంబరు 8న కనకదాస విగ్రహావిష్కరణ కార్యక్రమానికి హాజరు కావాలని కలెక్టర్, ఎస్పీని హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి, కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఆహ్వానించారు. ఈ మేరకు బుధవారం కలెక్టర్ ఆనంద్, ఎస్పీ జగదీష్‌కు కురుబ సంఘం నాయకులతో కలిసి వారు ఆహ్వాన పత్రికలు అందజేశారు. భక్త కనకదాస జయంతిని రాష్ట్ర ప్రభుత్వం నవంబ రు నెల 8న అధికారికంగా నిర్వహిస్తుందని, అదే రోజు కళ్యాణదుర్గంలో అధికారికంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. కళ్యాణదుర్గంలో కనకదాస సర్కిల్‌గా నామకరణం చేయనున్నామని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో కురుబ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పప్పుశనగ కోసం రిజిస్ట్రేషన్

అనంతపురం అర్బన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రైతు సేవా కేంద్రాల్లో గురువారం నుంచి సబ్సిడీ పప్పుశనగ కోసం రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. క్వింటా పప్పుశనగ పూర్తి ధర రూ.7800లు కాగా 25 శాతం సబ్సిడీపోను రైతు వాటా రూ.5850 చెల్లించాలన్నారు.

విజ్ఞానం పొందేలా..

సైన్స్ సెంటర్ సందర్శనకు విద్యార్థులు.. రోజుకు 300 మంది వచ్చేలా ఏర్పాట్లు

● నవంబరు నుంచి అమలుకు ప్రణాళిక
● విద్య, సమగ్రశిక్ష అధికారులకు కలెక్టర్ ఆదేశాలు

అనంతపురం విద్య, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని సైన్స్ సెంటర్ విద్యార్థులతో మళ్లీ కళకళలాడనుంది. విద్యార్థులకు సైన్స్ పట్ల ఆసక్తి, అవగాహన కల్పించడం కోసం ఏర్పాటు చేసిన ఈ సైన్స్ సెంటర్ గత కొన్నేళ్లుగా అధికార యంత్రాంగం పట్టించుకోకపోవడంతో నిర్మానుష్యంగా కనిపించేది. అయితే ఇటీవల జిల్లాకు వచ్చిన కలెక్టర్ ఆనంద్ ఈ సైన్స్ సెంటర్ అభివృద్ధిపై దృష్టి సారించారు. ఇటీవల జరిగిన విద్య, ఎస్ఎస్ఏ శాఖల సమీక్షలో సైన్స్‌సెంటర్‌కు వచ్చే విద్యార్థుల సంఖ్యను పెంచాలని ఆదేశాలు ఇచ్చారు. ఇందుకోసం ఈనెలాఖరు వరకు గడువు ఇచ్చారు. సైన్స్ సెంటర్‌కు అవసరమైన నిధుల కోసం సమగ్రశిక్ష ప్రాజెక్టు స్టేట్ డైరెక్టరు శ్రీనివాసరావుతో కలెక్టరు ఆనంద్ మాట్లాడి అంగీకరింపజేశారు.

రోజూ సందర్శనకు విద్యార్థులు

జిల్లాకేంద్రంలోని శారదానగర్‌లో ఉన్న సైన్స్ సెంటర్ సందర్శనకు ఇక రోజూ విద్యార్థులు రానున్నారు. ప్రతిరోజూ కనీసం 300మంది తప్పనిసరిగా సైన్స్ సెంటర్‌కు వచ్చేలా ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థులు సైన్స్ సెంటర్‌ను సందర్శించి, ప్రాజెక్టులను పరిశీలించి, పరిజ్ఞానం పెంచుకునేలా కృషి చేయాలని కలెక్టర్ టార్గెట్ పెట్టారు. దీంతో డీఈఓ ప్రసాద్ బాబు, ఎస్ఎస్ఏ ఏపీసీ శైలజ తన శాఖల సిబ్బందితో ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. నవంబరు 1 నుంచే సైన్స్ సెంటర్ సందర్శనకు ఏర్పాట్లు చేపడుతున్నారు.



జిల్లా సైన్స్ సెంటర్

ప్రణాళికలు సిద్ధం



సైన్స్ సెంటర్ సందర్శనకు రోజుకు 300 మందికి తగ్గకుండా విద్యార్థులు వచ్చేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. ఆమేరకు విద్యార్థులను సందర్శనకు తీసుకురావడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. ఈనెలాఖరుకు ఏర్పాట్లు పూర్తి చేసి నవంబరు నుంచి సందర్శనకు విద్యార్థులు వచ్చేలా చర్యలు తీసుకుంటాం. వచ్చిన పిల్లలకు ఇస్కాన్ ఏజెన్సీ ద్వారా మధ్యాహ్నభోజనం అందిస్తాం. అవసరమైన సిబ్బందిని నియమిస్తాం. - ప్రసాద్‌బాబు, డీఈఓ



సైన్స్ మ్యూజియంలో ఏర్పాటు చేసిన ప్రాజెక్టుల యంత్రాలు

ట్రావెలింగ్ అలవెన్స్

సైన్స్ సెంటర్ సందర్శనకు వచ్చే విద్యార్థులకు ట్రావెలింగ్ అలవెన్స్ (ప్రయాణచార్జీ), మధ్యాహ్న భోజనం అమలు చేయనున్నారు. జిల్లా శాఖ అధికారులు ఇచ్చిన ప్రణాళిక మేరకు మండల స్థాయి నుంచి ఎంఈఓ వివిధ పాఠశాలల విద్యార్థులను సైన్స్ సెంటర్ సందర్శనకు పంపాల్సి ఉంటుంది. సైన్స్ సెంటర్ సందర్శనకు వచ్చిన పిల్లలకు మధ్యాహ్న భోజనం అందించనున్నారు. డీఈఓ వీటిని పర్యవేక్షించాల్సి ఉంటుంది. ఆర్టీసీలో బాలికలకు ఉచిత ప్రయాణం ఉండటంతో బాలురకు ట్రావెలింగ్ అలవెన్స్ ఇవ్వనున్నారు. ఈ బాధ్యతలు ఎస్ఎస్ఏ ఏపీసీ చూసుకోవాల్సి ఉంటుంది.

పూర్తిగా సహకరిస్తాం: శైలజ, ఎస్ఎస్ఏ, ఏపీసీ



సైన్స్ సెంటర్ విద్యార్థులకు ఉపయోగపడేలా చూడాలని కలెక్టరు ఆదేశాలు ఇచ్చారు. ఆమేరకు ఎస్ఎస్ఏ ద్వారా అవసరమైన నిధులు, సిబ్బంది నియామకాలు చేపడతాం. సైన్స్ సెంటర్ సందర్శనకు దూరమండలాల నుంచి వచ్చే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రవాణాఖర్చులు అందజేస్తాం. ఇందుకు ఎస్పీడీ ఆమోదం వేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. మాశాఖ తరఫున పూర్తి సహకారం అందిస్తాం.

స్వామి భూమి స్వాహా..!

● వీరభద్రుడికి అర్చక కుటుంబం శఠగోపం
● రీ సర్వేతో వెలుగులోకి.. ఆర్డీఓకు ఫిర్యాదు



వీరభద్రస్వామి విగ్రహం

కూడేరు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): కొర్రకోడు వీరభద్ర స్వామి మాన్యం భూమిని అర్చక కుటుంబం తమ పేరిట మార్చుకుంది. స్వామి సేవ చేస్తున్నందుకు ఆ భూమిని సాగు చేసుకునే అధికారం మాత్రమే చట్టబద్ధంగా అర్చక కుటుంబానికి ఉంది. కానీ అర్చకత్వం చేస్తున్న వైసీపీ మండల నాయకుడి కుటుంబ సభ్యులు స్వామి భూములను తమ పేరిట మార్చుకుని, పట్టాదారు పాసుపుస్తకాలను తీసుకున్నారు. కూడేరు మండలం కొర్రకోడు సర్వే నంబర్ 117లో 23.73 ఎకరాలు, సర్వే నంబర్ 295లో 7.18 ఎకరాల భూమి 'వీరభద్రస్వామి నౌకరీ నిమిత్తం' అని డైక్లాట్‌లో స్పష్టంగా పొందుపర్చారు. స్వామి పూజ చేసే వారు ఆ భూమిని సాగుచేసుకునే వెసులుబాటు కల్పించారు. మాన్యం భూమిని రెవెన్యూ రికార్డుల్లో పట్టాదారుగా వీరభద్రస్వామి పేరు, అనుభవం కింద అర్చకుల పేర్లు నమోదు చేయాలి. కానీ దేవుడి పేరును మాయం చేశారు.



వీరభద్రస్వామి భూములు

రీ సర్వేతో వెలుగులోకి..

కొర్రకోడు రెవెన్యూ గ్రామంలో అధికారులు రీ సర్వే నిర్వహించారు. ఆ సమయంలో స్వామి పేరిట ఉండాల్సిన భూమి అర్చకుల పేరిట మారినట్లు వెలుగులోకి వచ్చింది. సర్వే నంబర్ 117లో 7.62 ఎకరాలను అర్చకుల కుటుంబ సభ్యులు మీనాక్షి, ఫణిరాజు, పుష్పావతి, నాగరాజు, బండారి పాటిల్ మనోజ్, వరదరాజులు, విజయలక్ష్మి పేరిట ఆన్‌లైన్ చేశారు. ఇదే సర్వే నంబరులో (117/ఏ) వరదరాజులు, విజయలక్ష్మి పేరిట 5.93 ఎకరాలను ఆన్‌లైన్‌లో ఎక్కించుకున్నారు. 295 సర్వే నంబర్‌లో దాదాపు 5.40 ఎకరాల భూమిని పెద్ద నాగభూషణ గౌడ్, చిన్న నాగభూషణ గౌడ్, వరదరాజులు, మధుబాబు, నాగరాజు, సతీష్‌గౌడు పేరిట ఆన్‌లైన్‌లో ఎక్కించుకున్నారు.

ఆర్డీఓకు నివేదిస్తున్నాం..

కొర్రకోడు రెవెన్యూ పరిధిలోని 117, 295 సర్వే నంబర్లలో భూములు వీరభద్ర స్వామివి. వీటిని అర్చకులు తమ పేరిట ఆన్‌లైన్‌లో ఎక్కించుకున్నారు. దీనిపై దేవదాయ శాఖ అధికారులు ఆర్డీఓకు ఫిర్యాదు చేశారు. అర్చకులకు వీఆర్ఓ ద్వారా నోటీసులు పంపినా స్పందించలేదు. డైక్లాట్ ఆధారంగా వీరభద్రస్వామి భూములుగా పరిగణించి, ఆర్డీఓకు నివేదికను పంపుతున్నాం.

- మహబూబ్ బాషా, ఇన్‌చార్జి తహసీల్దారు

ఆర్డీఓ దృష్టికి తీసుకెళ్లాం..

కొర్రకోడు వీరభద్రస్వామి భూములను అర్చకులు తమ పేరిట ఆన్‌లైన్ చేయించుకుని, పాసుపుస్తకాలు పొందారు. ఈ విషయాన్ని ఆర్డీఓ దృష్టికి తీసుకెళ్లాము. ఆన్‌లైన్‌లో అర్చకుల పేర్లను తొలగించి, దేవుడి పేరును నమోదు చేయించాలని కోరుతూ నివేదిక ఇచ్చాం. అర్చకులు స్వామి భూములను తమ పేరిట నమోదు చేయించుకోవడం నేరం. ఆర్డీఓ నిర్ణయం కోసం ఎదురుచూస్తున్నాం.

-రమేష్‌బాబు, ఈఓ, కూడేరు మండలం

చీనీ టన్ను రూ.19 వేలు

అనంతపురం రూరల్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): అనంత వ్యవసాయ మార్కెట్లో బుధవారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.19 వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపికశ్రేణి కార్యదర్శి, మార్కెటింగ్ శాఖ ఏడీ రాఘవేంద్రకుమార్ తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.8వేలు, సరాసరిగా రూ.14వేలు పలికాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 21 టన్నుల చీనీకాయలు వచ్చినట్లు చెప్పారు.

పాపంపేట ప్రజలకు భద్రత కల్పించాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్

నేడు కలెక్టరేట్ ఎదుట ధర్నా

అనంతపురం టౌన్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): పాపంపేటలో నివాసం ఉంటున్న 15 వేల కుటుంబాలకు భద్రత కల్పించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ డిమాండ్ చేశారు. గణేనాయక్ భవన్‌లో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జీపీఏ పేరుతో కొందరు స్థానికులను ఏడాదిగా తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారని అన్నారు. గ్రామంలోని 932 ఎకరాల శోత్రియం భూములలో ఐదు దశాబ్దాలకు పైగా ప్రజలు ఉంటున్నారని, అక్కడి భూమిని కొనుగోలుచేసి ప్లాట్లు వేసుకున్నారని, అప్పులు చేసి ఇళ్లను నిర్మించుకున్నారని అన్నారు. సమస్యను పరిష్కరించాల్సిన జిల్లా అధికారులు చోద్యం చూస్తున్నారని విమర్శించారు. పాపంపేట భూ మాఫియాకు అండగా ఉంటున్న సబ్ రిజిస్ట్రార్, తహసీల్దార్ కార్యాలయ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధితులకు అండగా గురువారం కలెక్టరేట్ ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా చేస్తామనితెలిపారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు శ్రీనివాసులు, నాగేంద్రకుమార్, బాలరంగయ్య, సావిత్రి, రామిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్

చెరువులన్నీ నింపండి

ఎమ్మెల్యే పరిటాల సునీత



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

అనంతపురం క్రైం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): పీఏబీఆర్ కుడి కాలువ కింద ఉన్న చివరి చెరువును కూడా నింపాలని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అధికారులను ఆదేశించారు. టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్‌తో కలసి అనంతపురంలోని తన క్యాంపు కార్యాలయంలో బుధవారం పీఏబీఆర్ ఇంజనీర్లు, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ ఏడాది జలాశయంలోకే చేరే నీరు, ఎన్ని చెరువులు నింపే వీలుందని అధికారులను అడిగి తెలుసుకున్నారు. తాడిమర్రి మండలంలో ప్రతి ఏటా చెరువు నీరు వస్తుందన్న ఆశతో రైతులు పంటలు సాగుచేసి నష్టపోతున్నారని అన్నారు. అందుకే ఈసారి చివరి చెరువు వరకూ నీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. సుమారు 115 కి.మీ. మేర కాలువ ఉందని, నీరు సరిపోకపోతే హంద్రీనీవా కాలువ నుంచి లింక్ కాలువ ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. ఆ దిశగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు.

బొమ్మనహాళ్ ఎంపీపీ రాజీనామా?

నాలుగురోజుల కిందటే జడ్పీ సీఈఓకు లేఖ

బొమ్మనహాళ్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): తన పదవికి బొమ్మనహాళ్ ఎంపీపీ పద్మ రాజీనామా చేసినట్లు సమాచారం. నాలుగు రోజుల కిందటే రాజీనామా పత్రాన్ని జడ్పీ సీఈఓకు అందజేసినట్లు తెలిసింది. మరో రెండ్రోజుల్లో ఎంపీపీ రాజీనామాను ఆమోదించి, అధికారికంగా ప్రకటించనున్నట్లు సమాచారం. మండలంలో ఉన్న మొత్తం 16 మంది ఎంపీటీసీలు వైసీపీకి చెందిన వారే. ఎంపీపీ స్థానం మహిళకు రిజర్వు కావడంతో అప్పటి వైసీపీ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి తనకు అత్యంత సన్నిహితుడైన చంద్రశేఖర్‌రెడ్డి భార్య శ్రీధరఘట్ట ఎంపీటీసీ సభ్యురాలు పద్మను ఎంపీపీ స్థానంలో కూర్చోబెట్టారు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ విజయం కోసం ఎంతో కష్టపడిన ముల్లంగి నారాయణ స్వామి తన భార్య నాగమణి (ఉప్పరహాళ్ ఎంపీటీసీ)కి ఎంపీపీ పదవీ ఇస్తారని ఆశ పడ్డారు. దక్కకపోవడంతో తీవ్రంగా మనస్తాపం చెందారు. దీంతో తొలుత రెండున్నరేళ్లు చంద్రశేఖర్‌రెడ్డి భార్యకు, ఆతర్వాత మిగిలిన పదవీకాలం నాగమణికి వర్తించేలా చేస్తానని చెప్పి సమస్యను కాపు సద్దుమణిగించారు. రెండున్నరేళ్ల తర్వాత కూడా ఇచ్చిన మాట నెరవేరకపోవడంతో ముల్లంగి సోదరులు 2024 ఎన్నికల సమయంలో టీడీపీలో చేరిపోయారు. ఒప్పందం ప్రకారం రెండున్నరేళ్ల తర్వాత కూడా నాగమణికి పదవి అప్పగించకపోవడంపై పలువురు ఎంపీటీసీ ప్రస్తుత ఎంపీపీ పద్మపై గుర్రుమని ఉన్నారు. ఎంపీపీ, వైస్ ఎంపీపీ మినహా మిగతా సభ్యులంతా నాగమణికి మద్దతుగా నిలవనున్నారు. దీంతో కొత్త ఎంపీపీగా నాగమణి ఎంపిక కావడం తథ్యమని భావిస్తున్నారు.

మొంథా.. గుండెకోత..!

వర్షాభావంతో నష్టపోతున్న వేరుశనగ రైతును చివర్లో మొంథా తుఫాను పూర్తిగా ముంచేస్తోంది. ఖరీఫ్‌లో సాగుచేసిన వేరుశనగ పంట కాలం పూర్తయింది. తొలగించుకునే దశలో మొంథా తుఫాను చుట్టుముట్టింది. ఇప్పటికే భూమిలో కాయలు మొలకలు పోతున్నాయి. పంట తొలగించుకుంటే పశుగ్రాసంతోపాటు కాయలు నాని పనికిరాకుండా పోతాయి. పంట తొలగించుకుంటే దిగుబడి దక్కదు. తొలగిస్తే కాయలు, కట్టె రెండూ దక్కవు. కొందరు అలాగే ఉంచుతుంటే.. మరికొందరు పంట కోతలు చేస్తున్నారు. ఇద్దరూ నష్టపోతున్నారు. మొలకలు పోతున్న పంటతో, నానిపోతున్న దిగుబడులు, కట్టెతో రైతుకు గుండెకోత తప్పట్లేదు.

శింగనమల, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో సాగుచేసిన వేరుశనగ అన్నదాతను నష్టాలపాల్జేస్తోంది. దిగుబడులు రాకపోగా.. కాసిన కాయలు బరువు లేకపోవడంతో కొనే నాథుడే లేడు. వ్యాపారులు తక్కువ ధరకే అడుగుతున్నారు. వారు అడిగిన రేటుకే ఇద్దామన్నా.. కొనేందుకు ముందుకు రావట్లేదు. మొంథా తుఫాను వర్షాల కారణంగా పంట తొలగించలేని దుస్థితి దాపురించింది. అలాగే ఉంచితే మొలకలు వస్తున్నాయి. మండలంలోని పెద్దమట్లగొంది, చిన్నమట్లగొంది, సలకంచెరువు, ఈస్టునరసాపురం, సోదనపల్లి, గోవిందరా



మొలకలు వస్తాయని పంటను తొలగించిన రైతులు

యునిపేట పరిధిలో ఖరీఫ్ సీజన్‌లో 2 వేల ఎకరాల్లో వేరుశనగ సాగు చేశారు. ఎకరాకి రూ.50 వేల వరకు పెట్టుబడులు పెట్టారు. పంట సాగు సమయంలో వర్షాలు సకాలంలో పడడంతో ఏపుగా పెరిగింది. దిగుబడులు బాగా వస్తాయని అన్నదాతలు ఆశపడ్డారు. పంట 70 రోజుల తరువాత వర్షాలు కురవక దిగుబడులు తగ్గిపోయాయి. దీంతో కాయలు లొత్తలుగా ఏర్పడ్డాయి.

మొలకలతో నష్టం

పంట కాలం పూర్తయింది. వెంటనే తొలగించాల్సి ఉంది. ఈ సమయంలో మొంథా తుఫాను వచ్చిపడింది. ఈ ప్రభావంతో వర్షాలు కురుస్తుండడంతో పంట తొలగించుకోలేని పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో భూమిలోనే మొలకలు వస్తున్నాయి. దీంతో కొందరు రైతులు పంటను తొలగించారు. అవి కూడా నాని మొలకలు వస్తున్నాయి. కాయలు, కట్టె నానిపోతున్నాయి. కాయలపై మచ్చలు, బూజు ఏర్పడే ప్రమాదం ఉంది. పశుగ్రాసం కూడా కోల్పోవాల్సి వస్తోంది. ఎకరాకి 7 క్వింటాళ్ల మేర దిగుబడులు వస్తున్నాయి. ప్రస్తుతం క్వింటా ధర రూ.4 వేలు పలుకుతోంది. ఈ లెక్కన 7 క్వింటాళ్లకు రూ.30 వేలలోపే రైతుకు దక్కుతుంది. ఎకరాలో పెట్టుబడి రూ.50 వేలు పెట్టడంతో అందులో కూడా రూ.20 వేలు కోల్పోవాల్సి వస్తోందని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు.

ధర నేలచూపులు..


పంట కోతల సమయంలో ధరలు అమాంతం పడిపోయాయి. 47 కిలోల బస్తా ధర కొన్నిరోజుల క్రితం వరకు రూ.3 వేలు పలుకుతుండేది. రైతులు పంట తొలగించుకుని వేరుశనగ కాయలు అమ్మడానికి సిద్ధం చేసుకున్నారు. ఇంటి వద్ద, పొలాల్లో రాశులు పోసుకున్నారు. కొనుగోలు చేయడానికి వస్తున్న వ్యాపారులు కాయలు లొత్తలుగా ఉన్నాయంటూ 47 కేజీల బస్తా రూ.2 వేలకే అడుగుతున్నారు. రైతులు విధిలేని పరిస్థితుల్లో ఆ ధరకే అమ్మేందుకు ముందుకొస్తున్నారు. ఆ తర్వాత కొనుగోలు చేసేందుకు వ్యాపారులు రావడంలేదు.

అనుమతులు రాలేదు

మండలవ్యాప్తంగా వేరుశనగ పంట తొలగిస్తున్నారు. వర్షాలు అదునులో కురవకపోవడంతో పంట దిగుబడులు తక్కువగా వచ్చాయి. 9 గ్రామాల్లో కాయలు లొత్తలుగా ఉన్నాయని తెలుస్తోంది. వేరుశనగ కాయల కొనుగోలుకు అనుమతిస్తే కొనుగోలు చేస్తాం.

- అన్వేష్‌కుమార్, ఏఓ, శింగనమల

అడిగే నాథుడే లేదు



నాలుగెకరాల్లో పంటను తొలగించి వారం రోజులు అయింది. కాయలను ఇంటి వద్ద రాశిపోసి వర్షానికి తడవకుండా పట్టలు కప్పి, కాపాడుకుంటున్నాం. పంట దిగుబడి ఎకరాకి 7 క్వింటాళ్లు కూడా రావట్లేదు. వ్యాపారులు ఇంటి వద్దకు వచ్చి కాయలు లొత్తలుగా ఉన్నాయని 47 కిలోల బస్తా రూ.1800 అడుగుతున్నారు. ఆ ధరకే విక్రయిద్దామనుకున్నా.. మరసటి రోజు వ్యాపారులు రావడం లేదు. ఎలా అమ్ముకోవాలో అర్థం కావడంలేదు.

- గంగరాజు, రైతు, పెద్దమట్లగొంది

రూ.2వేలకే అమ్మేశా..



మూడెకరాల్లో వేరుశనగ పంట తొలగించా. 47కిలోల బస్తా ధర రూ.2800 నుంచి 3000 వరకు అమ్ముడుపోతుందని భావించా. వర్షాభావ పరిస్థితుల కారణంగా కాయలు లొత్తలుగా వచ్చాయి. వ్యాపారులు అడిగిన మేరకు 47 కేజీల బస్తా రూ.2 వేలకే విక్రయించా. మూడెకరాల్లో రూ.60 వేలు నష్టం వచ్చింది. ఖరీఫ్‌లో వేరుశనగ పంట సాగు చేయాలంటే భయంగా ఉంది. - సురేంద్రయాదవ్, పెద్దమట్లగొంది

పంట వద్దకు పోతే కన్నీరే



నాలుగెకరాల్లో వేరుశనగ సాగుచేశా. రూ.2 లక్షల వరకు ఖర్చుచేశా. వర్షాభావ పరిస్థితుల కారణంగా దిగుబడులు రాలేదు. పంట తొలగించుకుని వచ్చిన దిగుబడి తీసుకుందామనుకుంటే తుఫాను కన్నీరు మిగిల్చింది. పొలంలో కాయలు మొలకెత్తుతున్నాయి. పంట మొత్తం ఇలాగే ఉంది. తొలగిస్తే పశుగ్రాసం దక్కదని దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నా. వర్షాలు తగ్గుముఖం పడితే తొలగించుకుంటా.

- బ్యాళ్ల చంద్రమోహన్, రైతు, పెద్ద మట్లగొంది

మద్దతు ధరతో కొనుగోలు చేయాలి



వర్షాభావ పరిస్థితుల కారణంగా వేరుశనగ దిగుబడులు తగ్గాయి. కాయలు లొత్తలుగా ఉండడంతో వ్యాపారులు కొనుగోలు చేయట్లేదు. ప్రభుత్వమే రూ.3వేలు మద్దతు ధరతో కొనుగోలు చేసి, ఆదుకోవాలి.

- శ్రీనివాసులు, రైతు సంఘం నాయకుడు, చిన్నమట్లగొంది

78 మందికి కారుణ్య నియామకాలు

అనంతపురం కలెక్టరేట్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ఒకేసారి 78 మందికి కారుణ్య నియామకాల కింద పోస్టులు ఇవ్వడంతో ఆయా కుటుంబాల్లో ఆనందం వ్యక్తమైంది. వివిధ ప్రభుత్వ శాఖల్లో జూనియర్ అసిస్టెంట్ పోస్టులు- 62, సచివాలయానికి సంబంధించి 8పోస్టులు, క్లాస్-4 ఉద్యోగులుగా 8 మందిని నియమించారు. మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న వీటపై కొత్త కలెక్టర్ ఆనంద్ దృష్టి సారించారు. వివిధ శాఖల నుంచి వచ్చిన కారుణ్య నియామకాల దరఖాస్తులన్నింటినీ పరిశీలించారు. శాఖల వారిగా ఎక్కడెక్కడ ఖాళీలున్నాయో అన్వేషించి జాబితా తయారు చేశారు. ఆ మేరకు సంబంధిత పోస్టులను కారుణ్య నియామకం కింద భర్తీ చేయించారు.

భయం లేకుండా పనిచేయండి

ప్రభుత్వం, ప్రజల కోసం ఎలాంటి భయం, పక్షపాతం లేకుండా పనిచేయాలని కలెక్టర్ ఆనంద్ సూచించారు. కలెక్టరేట్‌లో బుధవారం కారుణ్య నియామకాలకు సంబంధించి ఉత్తర్వుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. 78మందికి కారుణ్య నియామకాల పత్రాలను జేసీ శివనారాయణశర్మతో కలిసి కలెక్టర్ అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ శాఖల్లో పని చేసే అవకాశం తక్కువ మందికి దొరుకుతుందని, ఉద్యోగంలో రకరకాల ఇబ్బందులు, ఒత్తిళ్లు కూడా వస్తాయన్నారు. వీటన్నింటిని తట్టుకుని పనిచేయాలన్నారు. క్షేత్రస్థాయి సిబ్బంది సక్రమంగా పనిచేసి ఫైల్ పంపిస్తేనే ఉన్నత స్థాయిలో ఆమోదం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో డీఆర్ఓ మలోల, ఏఓ అలెగ్జాండర్, అధికారుల తదితరులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ

పక్కాగా ఉండాలి: కలెక్టర్

అనంతపురం రూరల్: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఈక్రాప్ బుకింగ్‌లో సామాజిక తనిఖీ పక్కాగా నిర్వహించాలని కలెక్టర్ ఆనంద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మండలంలోని తాటిచెర్లలో ఈక్రాప్ బుకింగ్‌లో సూపర్ చెక్ కార్యక్రమాన్ని బుధవారం ఆయన నిర్వహించారు. ముందుగా గ్రామ పరిధిలోని రామగోపాల్ చెందిన సర్వే నెంబరు 308-3ఏలో 2.74ఎకరాల పొలంలో దానిమ్మ పంట సాగు చేయగా, ఈక్రాప్ బుకింగ్‌లో ఆయన సామాజికి తనిఖీ నిర్వహించారు. సుదర్శనాచారికి చెందిన సర్వే నంబరు 320-1బిలోని 1.07ఎకరాలో సాగు చేసిన నిమ్మపంట ఈక్రాప్ బుకింగ్ సామాజిక తనిఖీ చేశారు. ఈసందర్భంగా సర్వే నంబర్లు, పంటల సాగు, విస్తీర్ణం, తదితర వివరాలను కలెక్టర్ రైతులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏడీఏ అల్తాఫ్ అలీఖాన్, తహసీల్దార్ మోహన్‌కుమార్, ఏఓ వెంకటకుమార్, ఉద్యాన శాఖ హెచ్ఓ రత్నకుమార్, వీఆర్వో మంజునాథ్, వీహెచ్ఏ గంపరాజు, వ్యవసాయ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



నియామక పత్రాలను అందజేస్తున్న కలెక్టర్

బడికి ఆలస్యంగా గురువులు

ఈ ఏడాది ముఖహాజరును ప్రకటించిన రాష్ట్రశాఖ

నెలలో 10రోజులపాటు వేలమంది టీచర్ల లేటు

10,046 మందిలో 9435 మంది ఆలస్యంగా హాజరు

అనంతపురం విద్య, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు వేళకు బడికి హాజరు కావాలంటూ ప్రభుత్వం ముఖహాజరు(ఎఫ్ఆర్ఎస్) తీసుకువచ్చినా అమలులో చాలా చోట్ల విఫలమవుతోంది. నిబంధన మేరకు ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఉదయం 9గంటలలోపు ముఖహాజరు వేయాల్సి ఉంది. వారు పనిచేసే పాఠశాలలు, ఎమ్మార్సీల వద్దకు వెళితేనే హాజరు నమోదవుతుంది. కానీ చాలా మంది ఉపాధ్యాయులు వేళకు బడికి వెళ్లి ముఖహాజర వేయడం లేదని గణాంకాలు చెబుతున్నాయి. ఈఏడాది జూన్12 నుంచి అక్టోబరు 28 వరకు ఉపాధ్యాయుల హాజరును రాష్ట్రశాఖ పరిగణనలోకి తీసుకుని రెండు రోజుల కిందట గణాంకాలు విడుదల చేసింది. ఎంతమంది ఎన్నిరోజులు సమయానికి వెళ్లి ముఖహాజర వేస్తున్నారు? ఎంతమంది సమయం తర్వాత హాజరు వేస్తున్నారో లెక్కలు తీసి ప్రకటించింది. అనంతపురం జిల్లాలో విద్యాశాఖ లెక్కల మేరకు 10,046మంది ఎంఈఓలు, హెచ్ఎంలు, టీచర్లు ఉన్నారు. 968మంది నాన్‌టీచింగ్ సిబ్బంది ఉన్నారు. వీరిలో 1నుంచి 10 రోజులుపాటు 9435మంది ఆలస్యంగా హాజరై ముఖ హాజరు వేశారు. ఇలా వేలమంది నెలలో 10రోజులు ఆలస్యంగా డ్యూటీకి వెళుతుండటంపై రాష్ట్ర విద్యాశాఖ సీరియస్‌గా తీసుకుంది. ఆలస్యంగా ఏపాఠశాల టీచర్లు, హెచ్ఎంలు, ఏ మండల ఎంఈఓలు



ముఖ హాజర వేశారో వారిపేర్లతో పాటు రాష్ట్రశాఖ వెల్లడించింది. 352మంది 11నుంచి 20రోజులుపాటు, 73మంది 21నుంచి 30రోజులు, 16మంది 41నుంచి 50రోజులు, 08మంది 51 నుంచి 60 రోజులు, ముగ్గురు 61నుంచి70రోజులు పాటు ఆలస్యంగా ముఖహాజరు వేసినట్లు రాష్ట్రశాఖ వెల్లడించింది. ఈజాబితాను పేర్లతో బయటపెట్టడంతో పాటు జిల్లా విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణ లోపంపైనా కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో జిల్లా విద్యాశాఖ ఐటీసెల్ సిబ్బంది ఆలస్యంగా హాజరు వేస్తున్నవారికి, అసలే హాజరవేయని వారికి ఫోన్‌లు చేసి హాజరుపై గట్టిగా చెబుతున్నారు. మొత్తం మీద ఈ ముఖహాజరు వ్యవహారం ఆశాఖలో తీవ్రదుమారం రేపుతోంది.

చర్యలు తప్పవు: డీఈఓ ప్రసాద్‌బాబు

ఎంఈఓలు, హెచ్ఎంలు, టీచర్ల హాజరుపై కమిషనర్ ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నారు. ఏప పాఠశాలలో ఎవరెవరు ఏ సమయంలో ముఖ హాజరు వేస్తున్నారు. అందులో ఆలస్యంగా ఎందరు వేశారో కూడా లెక్కలు తీసి జిల్లాకు పంపుతున్నారు. ప్రతి ఒక్కరు ఉదయం 9గంటల సమయానికి ముఖ హాజరు వేయాల్సిందే. 9.30గంటల తర్వాత ఎవరు హాజరు వేస్తున్నారో వారిపై ప్రత్యేక నిఘా ఉంచుతున్నాం. ఐటీసెల్ నుంచి ఆపాఠశాలకు ఫోన్‌చేసి ఆరా తీస్తున్నాం. పదేపదే హాజరులో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవు.

నేటి ప్రముఖులు

పోర్ట్రెయిట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

హోమీ జే బాబా (జయంతి)



భారతదేశ న్యూక్లియర్ పితామహగా పేరొందిన హోమీ జహంగీర్ బాబా 1909 అక్టోబరు 30న ముంబైలో జన్మించారు. భాభా అటామిక్ రీసెర్చ్ సెంటర్ సంస్థాపకులు, టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్‌లో ఫిజిక్స్ ప్రొఫెసర్‌గానే కాక వ్యవస్థాపక డైరెక్టర్‌గాను వ్యవహరించారు. ఫిజిక్స్‌లో నోబెల్ ప్రైజ్‌కు నామినేట్ అయ్యారు. ఎలక్ట్రానిక్స్, స్పేస్ సైన్స్, రేడియో ఆస్ట్రానమీ, మైక్రోబయాలజీలలో ఎన్నో పరిశోధనలు చేశారు. ఆడమ్స్ ప్రైజ్, 'పద్మభూషణ్' పురస్కారం, రాయల్ సొసైటీ ఫెలోషిప్ అందుకున్నారు. 1966 జనవరి 24న కన్నుమూశారు. ముంబైలో ఏర్పాటైన అటామిక్ ఎనర్జీ సెంటర్‌కు ఆయన గౌరవార్థం భాభా అటామిక్ రీసెర్చ్ సెంటర్‌గా పేరు మార్చారు. ఆయన పేరిట ప్రత్యేక పోస్టల్‌స్టాంప్ విడుదల చేశారు.

డియెగో మారడోనా (జయంతి)



అర్జెంటీనా దేశ ఫుట్‌బాల్ క్రీడాకారుడు డియెగో మారడోనా 1960 అక్టోబరు 30న జన్మించారు. 'ఫిఫా ప్లేయర్ ఆఫ్ ది ట్వంటీయెత్ సెంచరీ' విజేత. గొప్ప ఫుట్‌బాల్ క్రీడాకారులలో ఒకరిగా నిలిచారు. నాలుగు ఫిఫా వరల్డ్‌కప్ పోటీల్లో పాల్గొన్నారు. ఫ్రీ కిక్ స్పెషలిస్ట్‌గా రాణించి తన కెరీర్‌లో 359 గోల్స్‌తో 'గోల్డెన్ బాయ్'గా అభిమానులచే పిలవబడ్డారు. అనేక జట్లకు కోచ్‌లుగా వ్యవహరించారు. 2020 నవంబరు 25న కన్నుమూశారు. అర్జెంటీనాలో 'ఐకాన్' గా నిలిచారు.

అరుణ సాయిరామ్ (పుట్టినరోజు)



'పద్మశ్రీ' గ్రహీత అరుణ సాయిరామ్ 1952 అక్టోబరు 30న ముంబైలో జన్మించారు. శాస్త్రీయ సంగీత గాయనంలో రాణించి మ్యూజిక్ అంబాసిడర్ ఆఫ్ ఇండియాగా గుర్తింపు పొందారు. కర్ణాటక సంగీతశైలిలో నిష్ణాతులు. రాష్ట్రపతి భవన్, వీర్‌భూమి వేదికగాను, ఇజ్రాయెల్, జెరూసలెం ఫెస్టివల్స్‌తోపాటు లండన్‌లోని బీబీసీ ప్రామ్స్ వేదికగా కచేరీలు ఇచ్చిన తొలి కర్ణాటక సంగీత కళాకారిణి కావడం విశేషం. 2022 వరకు సంగీత నాటక అకాడమీ వైస్ చైర్‌పర్సన్‌గా వ్యవహరించారు. సంగీత కళానిధి, కళైమామణి, సంగీత చూడామణి, భారతి త్యాగరాజ సమ్మాన్ అవార్డు, అర్ష కళాభూషణ్ తదితర పురస్కారాలు పొందారు.

కుంభకోణాల చరిత్ర కాంగ్రెస్‌దే..

బీజేపీ నాయకుడు పోతుల సురేష్

రొద్దం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): దేశంలో కుంభకోణాల చరిత్ర కాంగ్రెస్‌కే దక్కుతుందని బీజేపీ నాయకుడు పోతులసురేష్ పేర్కొన్నారు. మంగళవారం రొద్దంలో వెంకటేశ్వరస్వామి కల్యాణమండపంలో బీజేపీ నాయకుల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పోతుల సురేష్ మాట్లాడుతూ నరేంద్ర మోదీ సారథ్యంలో దేశం పరుగులు పెడుతోందన్నారు. ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అభివృద్ధి చేస్తున్న ఘనత బీజేపీదేనన్నారు. గ్రామస్థాయిలో కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న పథకాలను ఇంటింటికీ వెళ్లి తెలియజేయాలని సూచించారు. నవంబరు 9న పుట్టపర్తిలో జిల్లాస్థాయి సమావేశం జరుగుతుందన్నారు. కార్యక్రమానికి రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు మాధవ్, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్, రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌళిశాఖ మంత్రి సవిత, ఎంపీ బీకే పార్థసారథి, జనసేన, కూటమి నాయకులు పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మనోజ్‌కుమార్, వేణుగోపాల్, చల్లా అరుణ్, పవన్, విజయభాస్కర్‌రెడ్డి, రవి, తిప్పేస్వామి, లింగమయ్య పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం విక్రేతల బైండోవర్

గుడిబండ, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): గుడిబండ మండలంలో కర్ణాటక మద్యం తీసుకొచ్చి అక్రమంగా విక్రయిస్తున్న నలుగురిపై కేసు నమోదుచేసి తహసీల్దార్ శ్రీధర్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎక్సైజ్ సీఐ మురళికృష్ణ, ఎస్ఐ శంకర్ తెలిపారు. బుధవారం చిగతుర్పి గ్రామానికి చెందిన మంజునాథ్, మోపురుగుండ్లుకు చెందిన కేశవలింగప్ప, ఎస్‌రాయాపురం గ్రామానికి చెందిన రంగప్ప, భార్య పుష్ప, బీటీపల్లి గ్రామానికి చెందిన పుట్టరంగప్ప గారి రఘునాథ్‌లను తహసీల్దార్ ఎదుట హాజరు పరుచగా రూ.లక్ష సొంత పూచీకత్తుపై బైండోవర్ చేసినట్లు తెలిపారు.

ముగిసిన శిక్షణ తరగతులు

రొద్దం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): సొంత నిధులు ఏవిధంగా పెంపొందించుకోవాలన్న విషయంపై పంచాయతీ కార్యదర్శులకు ఇస్తున్న శిక్షణ కార్యక్రమం బుధవారంతో ముగిసింది. ఎంపీడీఓ కార్యాలయంలో రాంకుమార్ అధ్యక్షతన రెండో రోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. ట్యాక్స్, నాన్‌ట్యాక్స్ ఎలా విధించాలి..? గ్రామ పంచాయతీలకు రెవెన్యూ ఎలా సమీకరించాలి..? తదితర అంశాలను ట్రైనింగ్ అధికారులు వివరించారు.

సోమందేపల్లి(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో రెండు రోజులపాటు గ్రామ పంచాయతీల అభివృద్ధిపై చేపట్టిన శిక్షణ తరగతులు బుధవారం ముగిసాయి. ఓఎస్ఆర్ నిధుల సమీకరణ, పంచాయతీల అభివృద్ధి పనులు ప్రణాళికలు రూపొందించడంపై పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, సచివాలయ సిబ్బందికి శిక్షణ ఇచ్చినట్లు ఎంపీడీఓ వెంకటలక్ష్మి తెలిపారు.

విధుల్లో అప్రమత్తంగా ఉండాలి

డిప్యూటీ డీఎంహెచ్ఓ

హిందూపురం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో పనిచేసే సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ మంజువాణి సూచించారు. బుధవారం హిందూపురం పట్టణ ఆరోగ్యకేంద్రాల్లో వైద్యులు, సిబ్బందితో పీపీయూనిట్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎంహెచ్ఓ మాట్లాడుతూ హైరిస్క్ గర్భవతులను గుర్తించి సుఖ ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. అత్యవసర విభాగాలకు తరలించే సమయంలో జాగ్రత్త వహించాలన్నారు. అన్ని పారామేటర్స్‌లో వందశాతం వృద్ధిచేయాలన్నారు. హైరిస్క్ గర్భవతులను అప్రమత్తంగా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ పద్మజ, పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

పునీత్‌ను స్మరించిన అభిమానులు



పునీత్ స్మారకం



హెచ్ఎస్ఆర్ లే అవుట్‌లో అభిమానులు తదితరులు

రాష్ట్రవ్యాప్తంగా పునీత్‌కు నివాళులు

బెంగళూరు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): కర్ణాటక రత్న పవర్‌స్టార్ పునీత్ రాజ్‌కుమార్‌ను అభిమానులు స్మరించారు. బుధవారం పునీత్ వర్ధంతిని పురస్కరించుకుని అభిమాని స్టూడియోలోని స్మారకం వద్ద ప్రత్యేక కార్యక్రమాలు జరిగాయి. ఉదయం పునీత్ కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు చేశారు. పునీత్ భార్య అశ్విని, సోదరులు శివరాజ్, రాఘవేంద్ర రాజ్‌కుమార్‌తోపాటు కుటుంబ సభ్యులు, సమీపబంధువులు తరలివచ్చారు. ఉదయం నుంచి రాత్రి దాకా ప్రత్యేక కార్యక్రమాలు జరిగాయి. అభిమానులు క్యూ కట్టి స్మారకాన్ని దర్శించుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా పునీత్ అభిమానులు పలుచోట్ల విగ్రహాలకు, చిత్రపటాలకు ప్రత్యేక పూజలు జరిపారు.

హెచ్ఎస్ఆర్ లే అవుట్‌లో..

బొమ్మనహళ్ళి(ఆంధ్రజ్యోతి): హెచ్ఎస్ఆర్ లే అవుట్ కూల్ జాయింట్ సర్కిల్‌లో నాల్గో వర్ధంతిని బుధవారం నిర్వహించారు. ఘనంగా పునీత్ రాజ్‌కుమార్‌కు నివాళులు అర్పించి అన్నదానం నిర్వహించినట్టు స్థానిక అభిమానుల సంఘం సభ్యులు శ్యామ్, గోపి తెలిపారు. గ్యారెంటీ పథకాల అమలు కమిటీ బొమ్మనహళ్ళి అధ్యక్షుడు టీ వాసుదేవరెడ్డి, గోపినాథరెడ్డి, రంగనాథ్ ఏ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



పునీత్ స్మారకం వద్ద అభిమానుల సందడి

బెంగళూరులో డ్రైవర్‌లేని కారు



ఆర్‌వీ ఇంజనీరింగ్ కాలేజీలో డ్రైవర్‌లెస్ కారు సంచారం

బెంగళూరు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ప్రపంచమంతటా ఏఐ హవా సాగుతోంది. ఎవరినోట విన్నా టెస్లాకారు గురించే సాగుతున్నాయి. డ్రైవర్ లేకుండానే రయ్.. రయ్...మంటూ చక్కర్లు కొట్టేస్తుంది. అయితే బెంగళూరులో ఇటువంటి కారు సంచరించింది. విప్రో, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్, ఆర్‌వీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లు సంయుక్తంగా డ్రైవర్‌లెస్ కారును రూపొందించాయి. ఇదే మొదలు బెంగళూరులోని ఆర్‌వీ ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో డ్రైవర్‌లెస్ కారు చక్కర్లు కొట్టింది. ఇది నిజమైన కారేనని, ఎవరికీ అనుమానం అవసరం లేదని ప్రకటించారు. ఆరేళ్లపాటు పరిశోధనలు చేసి ప్రోటోటైప్ కారును సిద్ధం చేశారు. ఆదర్శహెగ్డే అనే వ్యక్తి సోషల్‌మీడియాలో వీడియోను పోస్ట్ చేశారు. ఉత్తరాదిమఠం సత్యాత్మతీర్థ స్వామిజీ ఆర్‌వీ కాలేజీలో డ్రైవర్‌లెస్ కారులో ప్రయాణించారు. 28సెకండ్లపాటు ఈ వీడియో ఉంది. మంగళవారం సదరుకారును పరిచయం చేశారు. డ్రైవర్‌లేని కారులో రోడ్లపై సంచరించేందుకు ఎదురయ్యే సమస్యలను దృష్టిలో ఉంచుకుని నిర్మించారు. ఇది సంపూర్ణంగా కృత్రిమ మేథస్సు (ఏఐ) సెన్సార్, కెమెరా వ్యవస్థతో సాగనుంది. ఈ కారు ట్రాఫిక్ సిగ్నల్స్‌తోపాటు ముందుభాగంలో ఎవరైనా వెడుతుంటే గుర్తించే సామర్థ్యం కలిగి ఉంది. ఈ ప్రాజెక్టులో ఆర్‌వీ ఇంజనీరింగ్ విద్యార్థులు భాగస్వామ్యులయ్యారు.

ర్యాలీని విజయవంతం చేయండి

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రుద్రపోగు సురేష్ మాదిగ

పెనుకొండ, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ఆత్మగౌరవ ర్యాలీని నవంబరు 1న హైదరాబాద్‌లో నిర్వహిస్తున్నారని, దళితులు పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రుద్రపోగు సురేష్‌మాదిగ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడికి యత్నించిన ఘటన జరిగి ఇన్ని రోజులు అవుతున్నా ఇప్పటి వరకు కేసు నమోదు చేయకపోవడంతో శోచనీయమన్నారు. గవాయ్‌పై దాడిని నిరసిస్తూ మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో దళితుల ఆత్మగౌరవ ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. ర్యాలీని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పలక ఆంజనేయులు, రాష్ట్ర నాయకులు రామాంజినేయులు, కోనాపురం పెద్దన్న, హంటర్ ప్రసాద్, రాజు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన

పెనుకొండ, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ఏఎస్ఐ నసీమ బేగం గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. బాల్యవివాహాలు, సోషల్ మీడియా వల్ల జరిగే అనర్థాలను వివరించారు. ప్రిన్సిపాల్ సుదర్శన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నసీమ మాట్లాడుతూ ఏదైనా ఇబ్బందులు తలెత్తితే భయపడకుండా అధ్యాపకులు, తల్లిదండ్రులు, మహిళా సచివాలయ పోలీసులకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓలు శ్రీలేఖ, శివన్న, రవికుమార్, ఆర్ఆర్‌సి నోడల్ ఆఫీసర్ జయప్రకాశ్ పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడులు

మడకశిర రూరల్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): సేంద్రియ ఎరువుల వాడకంతోనే అధిక దిగుబడులు సాధ్యమని జిల్లా ఏపీఎస్‌పీసీఏ అధికారి వెంకటేశ్ సూచించారు. సేంద్రియ ఎరువుల వాడకంతోనే పంటలు ఆరోగ్యంగా ఉంటాయన్నారు. బుధవారం మండలంలోని గుండుమల గ్రామంలో సేంద్రియ వ్యవసాయ పద్ధతుల్లో సాగుచేసిన రాగి పంటను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సేంద్రియ ఎరువుల వాడకంతో అధిక దిగుబడి వస్తుందన్నారు. ధ్రువీకరణ పొందిన పంట ఉత్పత్తులు అధిక ధరకు ఎఫ్‌పీఓ ద్వారా కొనుగోలు చేసే అవకాశం ఉందన్నారు. పరీక్ష నిమిత్తం విత్తన నమూనాలను సేకరించి ల్యాబ్ పంపడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి తిమ్మప్ప, క్యూఎం ఎస్ మేనేజర్ ప్రవీణ్, రైతులు సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగిన సమీక్ష

హిందూపురం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): హిందూపురం అభివృద్ధి పనులపై రెండో రోజు బుధవారం కూడా సమీక్ష కొనసాగింది. మునిసిపాలిటీ పరిధిలో ఉన్న మట్టి రోడ్లు త్వరలోనే సీసీరోడ్లుగా మారుస్తారని మున్సిపల్ చైర్మన్ రమేష్ పేర్కొన్నారు. రూ.92.5కోట్లు నిధులు మంజూరైన నేపథ్యంలో అమినిటి కార్యదర్శులు, కౌన్సిలర్లు, నాయకులతో సమీక్ష జరిపారు. ప్రతి వార్డులో అభివృద్ధి పనులు జరిగేలా చూడాలన్నారు. త్వరలోనే మరికొన్ని నిధులు వస్తాయన్నారు. ఈ సమీక్షలో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి సురేంద్ర, ఎంఈ దస్తగిరి, డీఈ మదన్, లోకేష్, పట్టణాధ్యక్షుడు వెంకటేష్, నాయకులు సతీష్, గిరి, ఇర్షాద్, అమీన్, అయూబ్, సునీత, మంజుళ పాల్గొన్నారు.

లిఫ్ట్ మరమ్మతులకు ఎమ్మెల్యే సహకారం

హిందూపురం, అక్టోబరు29(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బహువిధ పశువైద్యశాలలో ఉన్న కోర్టుపైఅంతస్థుకు వెళ్లడానికి లిఫ్ట్ పనిచేయలేదు. కోర్టు భవనంలోకి మెట్ల నుంచి వెళ్లడానికి న్యాయమూర్తులు, న్యాయవాదులు, కక్షిదారులు ముఖ్యంగా వృద్ధులు ఇబ్బందిపడుతుండగా విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ మరమ్మతులు చేయించాలని అందుకు అవసరమైన మొత్తాన్ని ఇవ్వాలంటూ సురేంద్రకు చెప్పారు. బుధవారం రూ.60వేలు మొత్తాన్ని లిఫ్ట్ మరమ్మతులకు అందజేశారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రంగనాథప్ప



అధ్యక్ష, ఉపాధ్యక్షులను అభినందిస్తున్న న్యాయవాదులు

పావగడ, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా రంగనాథప్ప ఎన్నికయ్యారు. పట్టణంలోని మున్సిఫ్ కోర్టులో బుధవారం బార్ అసోసియేషన్ అధ్యక్ష ఎన్నిక జరిగింది. రంగనాథప్పకు 60ఓట్లు, వీడి వెంకటస్వామికి 30, రామాంజినేయులుకు 3 ఓట్లు వచ్చాయి. ఉపాధ్యక్షులుగా హనుమంతరాయప్ప, కార్యదర్శిగా చంద్రప్ప ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి మురళీధర్ తెలిపారు. వీరి ఎంపిక పట్ల ప్రముఖ న్యాయమూర్తులు మాదేష్, మునిరత్నమ్మ అభినందనలు తెలిపారు.

శాంతిభద్రతలే లక్ష్యం!

- పోలీసుల చర్యలతో నేరస్థులు హడల్
- పట్టణాల్లో కార్డెన్ సెర్చ్.. పలువురికి వార్నింగ్
- నేర నియంత్రణకు సీసీ కెమెరాల ఏర్పాటు
- ప్రశాంత జిల్లానే లక్ష్యం: ఎస్పీ

హిందూపురం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): పోలీసుల చర్యలతో నేరస్థుల గుండెల్లో గుబులురేగుతోంది. జిల్లాలోని ప్రధాన పట్టణాలలో శాంతిభద్రతలను కాపాడటమే లక్ష్యంగా ఎస్పీ ప్రత్యేక దృష్టి సారించారు. ఈక్రమంలోనే కార్డెన్ సెర్చ్ పేరుతో పాత నేరస్థులున్న ప్రాంతాలను జల్లెడ పడుతున్నారు. ఇప్పటికే ధర్మవరంలో కార్డెన్ సెర్చ్ పేరుతో ముమ్మర తనిఖీలు నిర్వహించారు. తాజాగా ఆదివారం హిందూపురంలో కరుడుగట్టిన నేరస్థులున్న గుడ్డం ప్రాంతాన్ని అణవణువు శోధించారు. మిగిలిన ప్రాంతాల్లో కూడా త్వరలోనే కార్డెన్ సెర్చ్ ప్రారంభించనున్నట్లు పోలీసు వర్గాల సమాచారం. ఎస్పీగా సతీష్‌కుమార్ బాధ్యతలు స్వీకరించిన మరుసటి రోజునుంచే జిల్లాలో నేరస్థుల కట్టడికి చర్యలకు ఉపక్రమించారు. ఇందులో భాగంగా అసాంఘిక శక్తులు, రౌడీ షీటర్లు రాజకీయ ముసుగులో దందాలు చేసే వ్యక్తులు, రేప్‌లకు పాల్పడిన వారిపై ప్రత్యేక నిఘా ఉంచారు. ఇప్పటికే సబ్‌డివిజన్ల వారీగా నేరస్థుల జాబితాను సిద్ధం చేశారు. అలాగే జిల్లాలో సెర్చ్ ఆపరేషన్ ప్రారంభించారు. మొదట పట్టణాలు ఆ తరువాత మండల కేంద్రాలు, అనంతరం జిల్లాలో అసాంఘిక శక్తులున్న గ్రామాలు ఫ్యాక్షన్ ప్రాంతాలపై నిఘా ఉంచనున్నారు.

నేరస్థులున్న ప్రాంతాలే టార్గెట్‌గా తనిఖీలు

గత కొన్నేళ్లుగా నేరాలకు పాల్పడుతూ, పోలీసులకు పట్టుబడి, బెయిల్‌పై బయకు వచ్చి దర్జాగా తిరుగుతున్న కరుడుగట్టిన నేరస్థుల వివరాలను సేకరించి వారున్న ప్రాంతాలపై నిఘా ఉంచారు. ఎట్టి పరిస్థితుల్లోనూ మరోసారి వారు నేరం చేయడానికి ఆస్కారం ఇవ్వకూడదని పోలీసులకు ఎస్పీ నుంచి ఆదేశాలందాయి. ఈ నేపథ్యంలోనే హిందూపురంలో పలువురు పాత నేరస్థులుంటున్న ప్రాంతాలను టార్గెట్ చేసి కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. వారి ఇళ్లవద్దకే ఎస్పీ నేరుగా వెళ్లి కుటుంబ సభ్యులు, వారి బంధువులకు గట్టి హెచ్చరికలు జారీ చేశారు. మరోసారి తప్పుచేస్తే, జరిగే పరిణామాలు ఊహించుకునేలా ఉండవని హెచ్చరించారు. జిల్లాలోని ప్రధాన పట్టణాల్లో నేరస్థులు నివాసమున్న ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, వారి కదలికలు నిత్యం గమనిస్తూ ఉండాలని పోలీసులను ఆదేశించారు.



గుడ్డం ప్రాంతంలో నేర చరితులతో మాట్లాడుతున్న ఎస్పీ

నేరాలు తగ్గించడానికే కార్డెన్ సెర్చ్: సతీష్‌కుమార్, ఎస్పీ

జిల్లాలో నేరాలను తగ్గించడానికే కార్డెన్‌సెర్చ్ నిర్వహిస్తున్నాం. మొదట పట్టణాల్లో తరువాత మండల కేంద్రాల్లో నిర్వహిస్తాం. ఈ కార్డెన్‌సెర్చ్‌లో నేరస్థులతోపాటు, రికార్డులులేని వాహనాలు దొరికే అవకాశం ఉంటుంది. నేరస్థులున్న ప్రాంతాల్లో సీసీకెమెరాలు ఏర్పాటు చేస్తాం. అసాంఘిక శక్తులను వదిలే ప్రసక్తే లేదు. జిల్లా ప్రశాంతంగా ఉండటమే మా లక్ష్యం.

వర్కింగ్ జర్నలిస్టు సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా శివానంద



శివానంద తగడూరు

బెంగళూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక వర్కింగ్ జర్నలిస్టు సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా మరోసారి శివానంద తగడూరు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 2025-28 వ్యవధికిగాను ఎన్నికల ప్రక్రియ సాగుతోంది. శివానంద మూడోసారి కూడా అధ్యక్షుడిగా కొనసాగనున్నారు. హాసన్ జిల్లా చన్నరాయపట్టణ తాలూకా తగడూరుకు చెందిన శివానంద సుదీర్ఘ కాలంగా పాత్రికేయుడిగా కొనసాగుతున్నారు. ఎన్నికల ప్రక్రియలో అధ్యక్ష హోదాకు శివానంద ఒక్కరు మాత్రమే నామినేషన్ వేయగా ఏకగ్రీవమయ్యారు. కానీ ఉపాధ్యక్షుడు, కార్యదర్శి, కోశాధికారితో పాటు ఈసీ మెంబర్‌లకు పోటీలు అనివార్యమయ్యాయి. కాగా శివానంద మరోసారి అధ్యక్షుడిగా ఎన్నిక కావడంతో సీనియర్ జర్నలిస్టులు సహా పలువురు ప్రత్యేకంగా అభినందించారు.

లాభాలబాటలో ఎల్‌అండ్‌టీ సంస్థ

బెంగళూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ ఎల్‌అండ్‌టీ ఫైనాన్స్ సంస్థ లాభాలబాటలో ఉంది. 2025-26 ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో పన్ను చెల్లించాక రూ.735 కోట్ల లాభాన్ని గడించింది. ఇది తొలి త్రైమాసికంతో పోలిస్తే 5శాతం వృద్ధితో, గత ఏడాదితో పోలిస్తే 6శాతం పురోగతి సాధించినట్టు ప్రకటనలో పేర్కొన్నారు. రిటైల్ రుణాలలో లక్ష కోట్ల మైలురాయిని అధిగమించిందన్నారు.

రేపు నాట్యపరంపర ఉత్సవ్

బెంగళూరు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): కూచిపూడి పరంపర ఫౌండేషన్ ఆధ్వర్యంలో 12వ విడత నాట్యపరంపర ఉత్సవ్ 31న శుక్రవారం జరుగునున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. మల్లేశ్వరం సేవాసదన్ ఆడిటోరియంలో ఉత్సవ్ జరుగునందన్నారు. విశాఖపట్టణంకు చెందిన కూచిపూడి గురువులు పశుమర్తి వెంకటరమణ, బెంగళూరుకు అనురాధ వెంకటరమణన్, హైదరాబాద్‌కు చెందిన సంయుక్త మట్సా ఆకుంది శ్రీసౌమ్యలతో పాటు పలువురు భాగస్వామ్యులవుతారన్నారు. సాయంత్రం 6గంటలకు కార్యక్రమం ప్రారంభం కానుందని ప్రవేశం ఉచితమని ప్రకటించారు.

గోవాలో రోడ్డు ప్రమాదం...

కారవార వైద్య విద్యార్థి దుర్మరణం

మరొకరికి గాయాలు



ఆదర్శపూజారి (ఫైల్)

బెంగళూరు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): గోవాలోని మాషం వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఉత్తరకన్నడ జిల్లా కారవార క్రిమ్స్ మెడికల్ విద్యార్థి దుర్మరణం చెందగా మరోవిద్యార్థి తీవ్రంగా గాయపడ్డాడు. బుధవారం ఇద్దరు విద్యార్థులు రాయల్ ఎన్‌ఫీల్డ్‌బైక్‌పై గోవాకు వెళ్లారు. హైవేలో వెళ్తుండగా ఒక్కసారిగా గేదె అడ్డం వచ్చింది. తప్పించే ప్రయత్నంలో అదుపుతప్పి కిందపడ్డారు. ఆదర్శపూజారి (23) మృతి చెందగా రనొక్ చావ్లా తీవ్ర గాయాలతో చికిత్సలు పొందుతున్నారు.

వైసీపీకి భవిష్యత్తు లేదు

టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి



పార్టీలోకి ఆహ్వానిస్తున్న గుండుమల తిప్పేస్వామి

మడకశిర టౌన్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): వైసీపీకి భవిష్యత్తులేదని, అందుకే ఆ పార్టీ నాయకులు టీడీపీలోకి చేరుతున్నారని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి అన్నారు. బుధవారం బాలాజీనగర్‌లోని పార్టీ కార్యాలయంలో మడకశిర మండల వైస్ ఎంపీపీ నరసింహమూర్తి, 20 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీ తీర్థం పుచ్చుకొన్నాయి. ఈసందర్భంగా గుండుమల తిప్పేస్వామి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో రాష్ట్రం అభివృద్ధివైపు అడుగులు వేస్తుండటంతో ఆ పార్టీ నేతలు టీడీపీ వైపు చూస్తున్నారని, స్వచ్ఛందంగా పార్టీలోకి చేరుతున్నారన్నారు. వైసీపీకి చెందిన నారాయణప్ప, రమేష్, భూతప్ప, నాగరాజు, శివమ్మ, 20 కుటుంబాలు పార్టీకి రాజీనామా చేసి, టీడీపీలోకి చేరారు. వారికి టీడీపీ పార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. మండల కన్వీనర్లు నాగరాజు, తిప్పేస్వామి పాల్గొన్నారు.

అమరాపురం(ఆంధ్రజ్యోతి): హేమావతి పంచాయతీ కేంద్రంలో వైసీపీ, కాంగ్రెస్ పార్టీల నుంచి మాజీ ఎమ్మెల్యే గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలో వంద కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. ఆలయ కమిటీ మాజీ చైర్మన్ నాగరాజు, రవీంద్రతోపాటు వంద కుటుంబాలు టీడీపీలో చేరాయి. గుండుమల వారికి కండువావేసి పార్టీలో సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కృష్ణమూర్తి, మాజీ జడ్పీటీసీ నరసింహమూర్తి, మడకశిర ఎస్సీసెల్ అధ్యక్షుడు జయకుమార్ పాల్గొన్నారు.

రుద్రాభిషేకంలో పాల్గొన్న గుండుమల

అమరాపురం(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని హేమావతి గ్రామంలో వెలసిన ఎంజేరు సిద్ధేశ్వరస్వామి ఆలయంలో అఖండ రుద్రాభిషేకంలో మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి పాల్గొన్నారు. మండల కన్వీనర్ కృష్ణమూర్తి, మాజీ జడ్పీటీసీ నరసింహమూర్తి, ఎస్సీసెల్ నియోజకవర్గ అధ్యక్షులు జయకుమార్ తదితరులు ఆయన వెంట ఉన్నారు.

నేటి నుంచి డివిజన్ స్థాయి క్రీడాపోటీలు

పెనుకొండ, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో గురువారం నుంచి ఎస్‌జీఎఫ్ డివిజన్‌స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం అవుతాయని ఎంఈఓ రాఘవయ్య, డీవైఈఓ జాన్‌రెడ్డప్ప, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి లక్ష్మీనారాయణ బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో డివిజన్‌లోని 12మండలాల నుంచి క్రీడాకారులు 1200మంది దాకా పాల్గొంటారన్నారు. పోటీలు మూడు రోజులపాటు జరుగుతాయని, కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రి సవిత, ఎంపీ బీకే పార్థసారథి, ఆర్డీఓ ఆనంద్‌కుమార్ హాజరవుతారన్నారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1626.06	1632.00
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	15,386	15,626
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	15,284	15,386
నీటి నిల్వ (టీఎంసీలు)	80.00	101.77

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



జ్యోతికకు ప్రశంస పత్రం అందిస్తున్న అధికారులు

బళ్లారిసిటీ, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): నగరంలోని క్రీడామైదానంలో జరిగిన జిల్లా స్థాయి పదవిపూర్వ కాలేజీల అథ్లెటిక్స్ పోటీల్లో విజయవాడ శ్రీ చైతన్య విద్యార్థి జ్యోతికా షార్ట్‌పుట్ త్రోలో ద్వితీయస్థానం సాధించి రాష్ట్రస్థాయికి ఎంపికైంది. విద్యార్థినికి విజయవాడ శ్రీచైతన్య పదవిపూర్వ కాలేజీ పాలకమండలి ఎం.హరికృష్ణ, డీన్ వెంకట మురళీధర్, ప్రిన్సిపాల్ వినోద్ కుమార్, బోధన, బోధకేతర సిబ్బంది అభినందించారు.

క్రీడలతో మానసికోల్లాసం



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

సిరుగుప్ప, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసికోల్లాసం లభిస్తుందని విద్యాశాఖాధికారి గుర్ర ప్ప అన్నారు. తాలుకాలోని హాళేకోట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు డివిజనల్‌స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారు. విద్యాశాఖాధికారి క్రీడాకారులను అభినందించారు. బళ్లారి జిల్లాలో జరిగిన కబడ్డీ పోటీల్లో ప్రథమస్థానంలో నిలవడంతో డివిజన్‌స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు.

వైద్య పరీక్షలు



ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యులు, రోగులు

సిరుగుప్ప, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మూడు నెలలకొకసారి బీపీ, షుగర్ పరీక్షలు చేసుకోవాలని బాగేవాడి ప్రాథమిక ప్రభుత్వాస్పత్రి వైద్యాధికారి సీఫీజ్ తెలిపారు. బుధవారం తాలుకాలోని బాగేవాడి ప్రభుత్వాస్పత్రిలో మానసిక వ్యాధిగ్రస్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ముందుగా అందరూ ప్రమాణాలు చేశారు. ప్రతి మనిషి ఏదో ఒక వ్యాధి బారినపడటం సర్వసాధారణమని, బుద్ధిమాంద్య, మానసిక రోగులు ప్రతినెలా బీపీ, షుగర్ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు మహమ్మద్ ఖాసీమ్, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

నగరసభ అధ్యక్షుడి పదవి ముగిసేనా..?



నగరసభ కార్యాలయం

సిరుగుప్ప, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): సిరుగుప్ప నగరసభకు ఎన్నికలు జరిగి నవంబరు 2కు ఐదేళ్లు పూర్తి కానుంది. అధ్యక్ష, ఉపాధ్యక్షులు పదవి చేపట్టినప్పుడు 2020వ సంవత్సరంలో ఎనిమిది నెలల పాటు అధికార బాధ్యతలు తీసుకోలేదు. ఈ కారణంగా కౌన్సిలర్లు ఇంకా ఎనిమిది నెలలు గడువు వుందని ధార్వాడ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ నెల 31వ తేదీన వీరి పదవీకాలం పొడిగించాలా వద్దా అనే అంశంపై కోర్టులో వాదనలు జరుగనున్నాయి. 31వ తేదీ హైకోర్టు ఏమి తీర్పు వెలువరిస్తుందోనని ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. నవంబరు 2వ తేదీ వరకు హైకోర్టు తీర్పు అనంతరం ఏమి జరుగుతుందోనని కౌన్సిల్ సభ్యులు ఎంతో ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు.

పొగాకు ఉత్పత్తులను నియంత్రించాలి: ఏడీసీ

బళ్లారి సిటీ, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలో లైసెన్స్ పొందకుండా పొగాకు ఉత్పత్తులను నియంత్రించాలని అదనపు కలెక్టర్ మహమ్మద్ జుబేర్ అన్నారు. బుధవారం నగరంలోని పాత కలెక్టరేట్ కార్యాలయ హాల్లో ఏర్పాటు చేసిన జిల్లా పొగాకు నియంత్రణ సెల్‌ప్రగతి సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. నిషేధిత పొగాకు ఉత్పత్తులను అక్రమంగా అమ్మేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాపట్టణాభివృద్ధి సెల్ పరిధిలోని దుకాణాలు, హోటళ్లు, వాణిజ్య దుకాణాల్లో పొగాకు ఉత్పత్తుల అమ్మకాలకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం అనుమతులు జారీ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలోని ప్రాథమిక, మాధ్యమిక విద్యశాఖ, ప్రీ-యూనివర్సిటీ విద్యాశాఖ పరిధిలోని అన్ని పాఠశాలలు, కళాశాలలను పొగాకు రహిత విద్యా సంస్థలుగా ప్రకటించి టోపీల్ యాప్‌లో వెంటనే నమోదు చేయాలన్నారు. లేనిపక్షంలో సంబంధిత అధికారులపై క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. పాఠశాల, కళాశాలల పిల్లలు పొగాకు ఉత్పత్తులకు బానిసలైతే దాని నుంచి బయటపడటం కష్టమన్నారు. అందుకే పొగాకు ఉత్పత్తుల దుష్ప్రభావాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. జిల్లాలోని అన్ని బార్, రెస్టారెంట్లలో స్మోకింగ్ జోన్లు తప్పనసరి చేయాలన్నారు. ఎక్సైజ్ అధికారులు వాటి వినియోగం నిబంధనలను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలన్నారు. జిల్లాలోని అన్ని బస్‌స్టాప్‌లలో పొగాకు వల్ల కలిగే దుష్ప్రభావాల గురించి అవగాహన కల్పించడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బస్‌స్టాపులను అపవిత్రం చేసేవారికి, బహిరంగ ప్రదేశాల్లో పొగాకు ఉత్పత్తులను తినేవారికి, ప్రతిచోటా ఉమ్మి వేసేవారికి జరిమానాలు విధించాలన్నారు. జిల్లాపొగాకు నియంత్రణ సెల్ కార్యక్రమ అమలు అధికారి డాక్టర్ మరియంబి మాట్లాడుతూ జూలై నుంచి సెప్టెంబరు వరకు జిల్లాలో మొత్తం 617 మంది క్షయరోగులలో 86మంది పొగాకు బానిసలని, వారందరినీ పొగాకు వ్యసన రహిత కేంద్రంలో చేర్పామని అన్నారు. సమావేశంలో జిల్లాసర్జన్ డాక్టర్ బసారెడ్డి, క్షయ నిర్మూలన అధికారి ఇంద్రాణి, ఆరోగ్య విద్య అధికారి ఇన్‌చార్జి ఖుర్షీద్ బేగం, పొగాకు సలహాదారు ప్రశాంత్, డీడీపీయూ, మున్సిపల్ కార్పొరేషన్, అన్నితాలూకా వైద్య అధికారులు పాల్గొన్నారు.



పోస్టర్లను విడుదల చేస్తున్న వైద్యాధికారులు, ఏడీసీ మహమ్మద్ జుబేర్

అన్ని థియేటర్లలో కన్నడ సినిమాలు ప్రదర్శించాలి

కన్నడ రాజ్యోత్సవంలో భాగంగా జిల్లాలోని అన్ని సినిమా, వీడియో థియేటర్లలో నవంబర్ 1 నుంచి 7వరకు కన్నడ చిత్రాలను తప్పనిసరిగా ప్రదర్శించాలని అదనపు కలెక్టర్ మహమ్మద్ జుబేర్ అన్నారు. కన్నడ సినిమాలు ప్రదర్శించకపోతే సినిమా హాళ్ల లైసెన్స్‌లు పునరుద్ధరించమని ఆయన హెచ్చరించారు. అక్టోబరు 31, నవంబరు 1వ తేదీల్లో సినిమా హాళ్లపై దీపాలు వెలిగించడం తప్పనిసరి అన్నారు.

విద్యార్థులు క్రీడల్లో పాల్గొనాలి: ఎంపీ

బళ్లారి సిటీ, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రీడల్లో పాల్గొనాలని ఎంపీ తుకారాం అన్నారు. సండూరు తాలూకా యారదమ్మనహళ్ళి గ్రామంతో పాటు 25పాఠశాలల్లో సీఎస్ఆర్ గ్రాంట్స్ కింద ఎన్ఎండీసీ రూ.25లక్షల విలువైన క్రీడా పరికరాలను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ వ్యాయామం చేసే వారికి మనస్సు నిశ్చలంగా ఉంటుందన్నారు. అనారోగ్యం నుంచి బయటపడేందుకు ఇది సహాయపడుతుందని, తల్లిదండ్రులు పిల్లలందరినీ క్రీడల్లో పాల్గొనేలా ప్రోత్సహించాలన్నారు. ఉపాధ్యాయులు కూడా ఇందుకు సహకరించాలన్నారు. పిల్లలకు గదులు, క్రీడాపరికరాలు, ప్రయోగశాలలు, లైబ్రరీ వ్యవస్థ, కంప్యూటర్ విద్య అందుబాటులో ఉంచామని వాటిని పూర్తిస్థాయిలో ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గంటికుమారస్వామి, శరణీయస్వామి, హనుమంతప్ప, గదగ్ రమేశ్, తహసీల్దార్ అనిల్ కుమార్, విద్యాశాఖాధికారి అక్కి, నీటిపారుదల శాఖ అధికారి పరమేశ్వరప్ప, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి నాగరాజు, బీఆర్పీ కార్తీక్, సీఆర్పీ ఓబన్న,చిన్నాపూర్ గౌడ,తాలూకా పంచాయితీ అధ్యక్షుడు శరయ్య, గ్రామ అధ్యక్షురాలు పార్వతమ్మకుమారస్వామి, ఎస్డీఎంసీ అధ్యక్షురాలు వరలక్ష్మీ,ఉపాధ్యక్షురాలు మంజుళ నాగరాజ్, గ్రామపంచాయితీ అధ్యక్షుడు గోవిందరెడ్డి, సభ్యులు గోవిందప్ప, హొన్నూర్‌స్వామి, ఉపాధ్యాయులు మంజునాథ్, బసవకుమార్, నాగేశ్‌పాటిల్, అంగన్వాడీ చైర్ పర్సన్ నాగరత్నమ్మ,అధ్యక్షురాలు వెంకటలక్ష్మీ, బండ్రి గ్రామస్థులు,పాఠశాల విద్యార్థులు, గ్రామపంచాయతీ ఎస్డీఎంసీ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.



పాఠశాలకు క్రీడాపరికరాలను పంపిణీ చేస్తున్న ఎంపీ తుకారాం

నష్టాలు మిగిల్చిన మొక్కజొన్న పంట



ఏపీఎంసీ ఆవరణలో మొక్కజొన్న పంటను ఆరబెడుతున్న రైతులు



వర్షానికి తడిసి ముద్దయిన మొక్కజొన్న

కంప్లి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో వేసిన మొక్కజొన్న పంట రైతులకు నష్టాలు మిగిల్చింది. దీనికి తోడు తుఫాను ప్రభావంతో కొనుగోలుదారులు ముందుకు రాక రైతన్నలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత ఏడాది రూ.రెండు వేలకు క్వింటాలు అమ్ముడుపోయింది. ఏడాది రూ.1200 నుంచి 1400 పలుకుతోంది. పెట్టిన పెట్టుబడులు కూడా రాక రైతులు ఆందోళన చెందుతున్నారు. కంప్లి పట్టణంలో ఏపీఎం శ్రావణంలో వర్షానికి తడిసిన మొక్కజొన్న పంటను ఆరబోస్తూ రైతు ఇబ్బందులకు గురవుతున్నారు. పగలనక రాత్రనక కష్టపడి పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక రైతులు సతమతమవుతున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు తల్లడిల్లుతున్నారు. వర్షాలతో నష్టపోయిన మొక్కజొన్న పంటకు పరిహారం అందించి ప్రభుత్వం ఆదుకోవాలని రైతు వెంకటేష్, రమేష్ కోరారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

కంప్లి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ప్రతివార్డులో ప్రజలు తమ చుట్టుపక్కల ప్రాంతాలను పరిశుభ్రంగా వుంచుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని పురసభ ముఖ్య అధికారి మల్లికార్జున సూచించారు. పట్టణంలో ప్రతినిత్యం పురసభ ఆధ్వర్యంలో ప్రతి వార్డుకు వచ్చే వాహనాల్లో తడి, పొడి చెత్తాచెదారాన్ని వేసి సిబ్బందికి సహకరించాలని కోరారు. ప్రతి ఒక్కరూ మురుగు కాలువలను పరిశుభ్రంగా వుంచి బ్లీచింగ్ పౌడర్ చల్లి వార్డులలో రోగాల బారిన పడకుండా నిర్మల్య అధికారులు, సిబ్బంది, వార్డులో తిరుగుతూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఇప్పటికే ప్రత్యేకంగా స్వచ్ఛత విధానంపై నియామకమైన సిబ్బంది తమదైన శైలిలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.



పురసభ వద్ద తడి పొడి చెత్తాచెదారాన్ని వేసిన బాక్సులు

సోదరభావం ప్రగతికి మార్గం

● ఎస్పీ పుట్టమాదయ్య

రాయచూరు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): భిన్న జాతులు, సంస్కృతులకు ఆలవాలమైన భారతదేశంలో ఐక్యత, సోదరభావాలే ప్రగతికి మార్గమని ఎస్పీ పుట్టమాదయ్య అన్నారు. బుధవారం సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని నగరంలోని ఎస్ఎస్ఆర్‌జీ కళాశాలలో విద్యార్థులకు వ్యాస రచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. విజేతలైన వారికి ఎస్పీ చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. ఎస్పీ మాట్లాడిన జాతీ సమైక్యత దేశ సమగ్రతల కోసం పటేల్ చేసిన కృషిని విద్యార్థులకు వివరించారు. మహనీయుల ఆశయాల సాధన కోసం మనమందరం పునరంకితమవుదామని పిలుపునిచ్చారు.



విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న ఎస్పీ



మాట్లాడుతున్న న్యాయాధికారి రాజేష్ హొసమనె

సంరక్షకుల పాత్ర ఎనలేనిది

● జిల్లా న్యాయాధికారి రాజేష్ హొసమనె

బళ్లారి సిటీ, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు, వృద్ధుల సంరక్షకుల పాత్ర ఎనలేనిదని సీనియర్ సివిల్ న్యాయాధికారి రాజేష్ హొసమనె అన్నారు. బుధవారం నగరంలోని అనుగ్రహ స్పెషల్ చిల్డ్రన్స్ నాన్ రెసిడెన్సియల్ స్కూల్లో జిల్లా యంత్రాంగం, జిల్లా పంచాయతీ, లీగల్ సర్వీసెస్ అథారిటీ, మహిళా శిశు అభివృద్ధి శాఖ, దివ్యాంగుల సీనియర్ సిటీజన్ల సాధికారత శాఖ, పునరావాస కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ సంరక్షకుల దినోత్సవ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రత్యేక అవసరాలున్న వారికి సేవ చేసే అవకాశం అందరికీ రాదన్నారు. .సంరక్షకుల సేవ పట్ల ఆయన కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా వికలాంగుల సంక్షేమ అధికారి గోవిందప్ప, ఫాదర్ ఇవాన్ ఫింటూ,చెం గారెడ్డి మానసిక రెసిడెన్షియల్ స్కూల్ గురుమూర్తి ,అనుగ్రహ మానసిక వికలాంగుల నాన్-రెసిడెన్షియల్ స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ ప్రజ్ఞ, అనుగ్రహ స్కూల్ సీనియర్ టీచర్‌సిస్టర్ మార్లిన్, ఉపాధ్యాయులు వసంత్ కుమార్, సంరక్షకుల తరపున తల్లిదండ్రులు శివరాం పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి



సమావేశంలో మాట్లాతున్న డీసీ నితీశ్

రాయచూరు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం నేర్దేశించిన కనీస మద్దతు ధర ఆధారంగా జిల్లాలోని రైతుల నుంచి తెల్లజొన్నలు కొనుగోలు చేసేందుకు కేంద్రాల ఏర్పాటుకు అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లాధికారి, జిల్లా టాస్క్‌ఫోర్స్ సమితి అధ్యక్షుడు కే నితీశ్ ఆదేశించారు. కేంద్రాల ఏర్పాటుకు సంబంధించి బుధవారం నూతన జిల్లాధికారి కార్యాలయంలో వ్యవసాయం, ఆహారం పౌర సరఫరాల శాఖ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన మేరకు హైబ్రీడ్ రకం తెల్లజొన్నలకు రూ.3500, దేశవాళి రకం జొన్నలకు రూ.3740 ప్రకారం కొనుగోలు చేసేలా రైతుల పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఇందుకు సంబంధించి జనవరి 2026 1వ తేదీ నుంచి 2026 మార్చి 31వ తేదీలోగా కొనుగోలు జరిగేలా ఏర్పాట్లు చేయాలన్నారు. రైతుల బయోమెట్రిక్ ఆధారంగా వారి నుంచి జొన్నలు సేకరించాలన్నారు. జొన్నల నాణ్యతకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన మేరకు వాటిని పరిశీలించేందుకు థర్డ్‌పార్టీల నియామకానికి సంబంధించి టెండర్లు అహ్వానించాలన్నారు.

విద్యుదాఘాతంతో కార్మికుడి మృతి

రాయచూరు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని లింగసుగూరు తాలూకా కరడకల్ గ్రామ ఎస్టీ వసతిగృహంలో పనిచేస్తున్న కార్మికుడు విద్యుత్‌షాక్‌కు గురై మృతిచెందాడు. మృతుడు కరడకల్ గ్రామానికి చెందిన దుర్గేష్‌గా అధికారులు తెలిపారు. కరడకల్ గ్రామంలోని ఎస్టీ వసతిగృహంలో సెంట్రింగ్ పనులు చేస్తుండగా విద్యుత్ తీగ తగలడంతో కుప్పకూలిపోయాడు. వెంటనే అధికారులు ఆయనను చికిత్స నిమిత్తం లింగసుగూరు తాలూకా ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఘటనకు సంబంధించి లింగసుగూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది.

బైక్‌ను అడ్డగించి రూ.4 లక్షల దోపిడీ

రాయచూరు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): బ్యాంక్ నుంచి నగదు తీసుకెళుతున్న ఇద్దరు యువకులను అడ్డగించిన దుండగులు వారి వద్ద ఉన్న రూ.4లక్షలు దోచుకెళ్లారు. ఈ ఘటన ముదగల్ పట్టణ సమీపంలో మంగళవారం సాయంత్రం చోటు చేసుకుంది. మట్టూరు గ్రామానికి చెందిన మల్లికార్జున్, హంపణ్ణ ముదగల్ పట్టణంలోని ఓ బ్యాంక్‌లో రూ.4 లక్షలు డ్రా చేసుకుని సొంతూరికి బైక్‌పై వెళుతుండగా సంఘటన చోటు చేసుకుంది. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముదగల్ సీఐ, ఎస్ఐలు ఘటనా స్థలాన్ని పరిశీలించి నిందితుల కోసం గాలింపు చేపట్టారు.

రిటైర్డ్ అంగన్‌వాడీలకు న్యాయం చేయాలి



టిప్పుసుల్తాన్ గార్డెన్ వద్ద ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు

రాయచూరు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు తీర్పు మేరకు పదవీ విరమణ చేసిన అంగన్‌వాడీ వర్కర్లకు తగిన వేతనం అందించాలని సీఐటీయూ అనుబంధ అంగన్‌వాడీల వర్కర్ల సంఘం జిల్లా అధ్యక్షురాలు పద్మ డిమాండ్ చేశారు. 2011 నుంచి 2023 మధ్య రిటైరైన అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న రూ.143 కోట్లను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలన్నారు. బుధవారం నగరంలోని టిప్పు సుల్తాన్ గార్డెన్ వద్ద అంగన్‌వాడీ వర్కర్లు ఆందోళన చేపట్టారు. 1975లో ప్రారంభమైన ఐసీడీఎస్ ద్వారా లక్షలాది మందికి సేవలందిస్తున్న గ్రామీణ ప్రాంతాలకు చెందిన అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలకు ఇప్పటి వరకు న్యాయం జరగకపోవడం దారుణమన్నారు. 1972 యాక్ట్ ప్రకారం అంగన్‌వాడీలు, ఆయాలకు చెల్లించాల్సిన మొత్తాన్ని ప్రభుత్వం 2023లో జరిగిన సమ్మె సందర్భంగా హామీ ఇచ్చినా ఇప్పటి వరకు అమలు కాలేదన్నారు. వెంటనే నిధులు విడుదల చేసి న్యాయం చేయాలన్నారు. అంగన్‌వాడీల ఆందోళన శిబిరం వద్దకు వచ్చిన సీడీపీఓలు వారి సమస్యలపై వినతి పత్రం స్వీకరించి ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం

● జిల్లా న్యాయాధికారి మారుతి బగాడె

రాయచూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): రోజురోజుకు పెరిగిపోతున్న సైబర్ నేరాల పట్ల ప్రజలను మరింత అప్రమత్తం చేయాల్సిన అవసరం ఉందని జిల్లా న్యాయాధికారి మారుతి బగాడె అన్నారు. వంచనకు గురవుతున్న వారిలో విద్యావంతులు, యువతులే ఎక్కువగా ఉండడం విచారకరమన్నారు. బుధవారం నగరంలోని ఎస్పీ కార్యాలయం వద్ద సైబర్ నేరాలపై అవగాహన జాతాను న్యాయాధికారి ప్రారంభించారు. ఎస్పీ కార్యాలయం నుంచి ప్రారంభమైన జాగృతి జాతా నగరంలోని ప్రధాన రహదారి కూడళ్ల గుండా సాగింది. ర్యాలీని ప్రారంభించిన న్యాయాధికారి, సైబర్ నేరాలు జరుగుతున్న తీరు తీసుకోవల్సిన జాగ్రతల గురించి పోలీసులకు పలు సూచనలు చేశారు. మోసం చేస్తున్న వాళ్లు, మోసానికి గురవుతున్న వారు కూడా విద్యావంతులే ఉండడం గమనర్హామన్నారు. ఈ విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండడమే నియంత్రణకు పరిష్కారమన్నారు.



మాట్లాడుతున్న న్యాయాధికారి మారుతి బగాడె

హోసూరు జోన్

చురుగ్గా రాజాజీ స్మారకం పునరుద్ధరణ పనులు

హోసూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు, స్వతంత్ర భారత తొలి, చివరి గవర్నర్ జనరల్ రాజాజీగా పేరొందిన రాజగోపాలాచారి చక్రవర్తి నివాసాన్ని స్మారకంగా పునరుద్ధరిస్తున్నారు. కృష్ణగిరి జిల్లా హోసూరు సమీపాన తొరపల్లి గ్రామంలో సమాచార, ప్రజా సంబంధాల శాఖ ఆధ్వర్యంలో రాజాజీ స్మారక గృహాన్ని రూ.44.50 లక్షలతో పునరుద్ధరణ చర్యలు చేపట్టారు. కలెక్టర్ దినేశ్‌కుమార్ బుధవారం స్వయంగా పరిశీలించారు. రాజాజీ 1878 డిసెంబరు 10న తొరపల్లి గ్రామంలో జన్మించారు. రాజాజీ జన్మించిన ఇంటిని ప్రస్తుతం సమాచార, ప్రజా సంబంధాల శాఖ పర్యవేక్షిస్తోంది. రాజాజీ నిలువెత్తు విగ్రహాన్ని ప్రజల సందర్శన కోసం ఇంట్లో ఉంచారు. రాజాజీ స్మారక గృహాన్ని ప్రతిరోజూ తమిళనాడు, ఇతర రాష్ట్రాల నుంచి ప్రజలు పర్యాటకులు సందర్శిస్తారు. తమిళనాడు ముఖ్యమంత్రి ఇటీవల పర్యటన వేళ రాజాజీ ఇంటిని, దాని అసలు వైభవానికి పునరుద్ధరించే పనులకు శ్రీకారం చుట్టారు. పాత వెదురు, టైల్స్ మార్చబడ్డాయి. సందర్శకులకోసం నీటి సరఫరా, విద్యుత్, మరుగుదొడ్ల సౌకర్యాలు వంటి ప్రాథమిక మౌలిక సదుపాయాల పనులు చురుగ్గా జరుగుతున్నాయి. పనులను నాణ్యతతో చేపట్టి త్వరలో అందుబాటులోకి తెస్తామని కలెక్టర్ తెలిపారు. తనిఖీలో హోసూరు సబ్‌కలెక్టర్ ఆకృతిశెట్టి, డిపార్ట్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సెందిల్‌కుమార్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అరుళ్, పబ్లిక్ రిలేషన్స్ అధికారి మోహన్, తహశీల్దార్ గుణశివ, ఏరియా డెవలప్‌మెంట్ అధికారులు మహ్మద్ సీరజ్‌వుద్దీన్, వెంకటేశన్ పాల్గొన్నారు.



రాజాజీ స్మారక భవనంలో పనులను పరిశీలించిన కలెక్టర్

ఓటరు సవరణపై కలెక్టర్ సమీక్ష

● నవంబరు 4 నుంచి నెలపాటు ప్రత్యేక కార్యాచరణ



మాట్లాడుతున్న కలెక్టర్ దినేశ్ కుమార్

హోసూరు(కృష్ణగిరి), అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఓటరు జాబితా సవరణకు సంబంధించి కృష్ణగిరి జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.దినేశ్‌కుమార్ అధ్యక్షతన బుధవారం ప్రత్యేక సమీక్షా సమావేశం జరిగింది. ఓటరు జాబితా సవరణలకు సంబంధించి అన్ని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో చర్చించారు. కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించిన ప్రత్యేక సవరణ మార్గదర్శకాల ప్రకారం నవంబరు 4 నుంచి డిసెంబరు 4వరకు ఒక నెల పాటు ప్రత్యేక కార్యాచరణ కొనసాగుతుందన్నారు. ముసాయిదా ఓటరు జాబితా డిసెంబరు 8న ప్రకటించబడుతుందన్నారు. నెలపాటు ఇందుకు సంబంధించి అభ్యంతరాలు స్వీకరించబడతాయన్నారు. అనంతరం అంతిమ ఓటరు జాబితా 2026 ఫిబ్రవరి 7న ప్రకటించబడుతుందన్నారు. ఓటరు జాబితాకు సంబంధించిన స్పెషల్ డ్రైవ్‌లో పోలింగ్‌బూత్‌స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. మృతులు, శాశ్వతంగా వలస వెళ్లినవారు, ఒకటి కంటే ఎక్కువస్థలాల్లో నమోదు చేసుకున్నవారి వివరాలను గుర్తించి తొలగించాలన్నారు. కొత్త ఓటర్లను చేర్చడానికి ఫాం 6ను భర్తీ చేయాలన్నారు. ప్రస్తుత ఓటర్ల జాబితాలోని పేర్లు 2002-2005నాటి మునుపటి ఓటర్ల జాబితాతో సరిపోలకపోతే లేదా, లింక్ చేయకపోతే, ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి ద్వారా ఆ ఓటర్లకు నోటీసు పంపబడుతుందని తెలిపారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి సాధనకురళ్, హోసూరు సబ్ కలెక్టర్ అకృతిశెట్టి, గోపు, రెవెన్యూ డివిజనల్ అధికారి షాజహాన్, జిల్లా పంపిణి అధికారి గీతారాణి, జిల్లా ఆది ద్రావిడ సంక్షేమ అధికారి శివకుమార్, ప్రత్యేక సహాయ కలెక్టర్ అభినయ, తహశీల్దార్ సంపత్, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.